ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జులై 11, 2010

రేటింగ్ రేసు... తిరకాసు...

Entered

హ్యాపీ బర్త్‌డే

(2010 జులై 11 నుంచి
2010 జులై 17 వరకు)

ఎ. వాగ్దేవి
2సం॥, జులై-2008
పైడిరాజు-అప్పలరాజు
ఎల్.కోట-విజయనగరం

తాహరజాకి
4సం॥, జులై-16
షబానారాజా-అయూభ్‌రాజా
డోర్నకల్-వరంగల్

కె.ఎం. పూర్ణిమ
5సం॥, జులై-13
జయలక్ష్మీదేవి-శ్రీనివాసులు
ఆత్మకూరు-కర్నూలు

చందన(బార్బి)
1సం॥, జూన్-2009
రేణుక-లక్ష్మణ్
గజ్వేల్-మెదక్

షేక్ యాసిన్‌బాషా
7సం॥, జులై-2003
జాన్‌సైదా-కరిమూన్
ప్రత్తిపాడు-గుంటూరు

అనుదీప్
1సం॥, జులై-2009
లోకేశ్వరి-రాజ్‌కుమార్
ఉప్పరపల్లి-వరంగల్

సిహెచ్.దివ్య
జులై
చంద్రకళ-పద్మారావు
ఈస్ట్‌మారేడ్‌పల్లి-హైదరాబాద్

టి. శాంతి స్వరూప్(లక్కి)
1సం॥, జులై-17
వరలక్ష్మి-లోవరాజు
రాజేంద్రనగర్-రాజమండ్రి

బి. మహేందర్
జులై-15
కమల-హగయ్య
చెన్నూరు-ఆదిలాబాద్

డి. సోనార్‌బాబు
4సం॥, జులై-15
శైలజాకుమారి-విజయభాస్కర్
చీరాల-ప్రకాశం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

ఇదీ 'రాయల' కాలమే!

కొన్ని సందర్భాల్లో- 'గతం' చాలా గొప్పదనిపిస్తుంది! 'మంచి గతమున కొంచెమేనోయ్!' అన్న కవి వాక్కు ఆ క్షణాన గుర్తుకు రాదు. ఈ కారణంగానే- ఇప్పటికీ 'రామరాజ్యం', 'స్వర్ణయుగం' వంటివి గొప్ప 'ఆదర్శ' రాజ్యాలుగా ఊరిస్తుంటాయి. ఎన్నికల నినాదాలై మార్మోగుతుంటాయి. కాలం ఏదైనా, పాలన ఎవరిదైనా- సామాన్యుడి జీవన ప్రమాణమే సత్పాలనకు గీటురాయి. అయితే, అలాంటి గీటురాళ్లు చరిత్ర పుటల్లో, ముఖ్యంగా రాచరికపు చరిత్ర పుస్తకాల్లో దొరకటం కష్టం! ఆస్థాన కవులు విరచించిన ఆహో ఓహో స్తోత్రాల్లోంచి అసలు నిజాలను దర్శించలేం!

తాజాగా శ్రీకృష్ణ దేవరాయలు పంచ శత పట్టాభిషేక మహోత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య- 'రాయలు పాలన మాకు స్ఫూర్తి' అని ఉద్ఘోషించారు. మంచి పాలనకోసం ఆయన పరితపించడంలో తప్పేం లేదు. అయితే, తరచితరచి చూస్తే- రోశయ్య హయాం రాయలు రాజ్యం కన్నా ఘనంగా ఉందనే చెప్పుకోవచ్చు! అది ఎలాగంటే ...

రాయలు కాలంలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారట (వాటిని ఏ సామాన్యుడు కొన్నాడని లెక్కలు అడక్కండి)! రోశయ్య హయాంలో మాత్రం ఇలాంటి అమ్మకాలకు కొదవేం ఉంది? ఆ మధ్య సారా కొట్లు వేలం వేస్తే- ఎంతమంది పోటాపోటీగా 'బారులు' తీరలేదు? ఎన్ని కోట్లు మద్యంలా ప్రవహించలేదు! దానికి ముందు ప్రభుత్వ భూములు తేరగా తెగనమ్ముతుంటే ఎంతమంది బడాబాబులు తెగబడ్డారో తెలియనిది ఎవరికి? ఇలాంటి విషయాల్లో రాయలు హయాం పోటీ పడగలదా?

మూతికి చిక్కం వేసి, పచ్చ గడ్డి ముందర కట్టి తెనాలి రామలింగడు గుర్రాన్ని యోజనాలకు యోజనాలు పరిగెత్తించాడట! ఆ విద్య రోశయ్యకో, ఆ ముందరి నాయకులకో తెలియనిదా? పథకాల ఎరలతో ఎన్ని ఎన్నికలను గోదాలను దాటలేదు? ఎన్నికల ఏరు దాటాక పథకాలకు కత్తెర వేసే కళ రాయలు వారికి తెలుసా? అనేకమార్లు విత్తమంత్రిగా వెలుగొందిన రోశయ్యకు కాక ఈ కీర్తికిరీటం మరెవరికి దక్కుతుంది? సామాన్యులపై పన్నులు వేసి, సంపన్నులకు పనులు చేసి- చాకచక్యంగా సాగిస్తున్న పాలనకు రాయలు సైతం ముక్కున వేలేసుకోవల్సిందే! 'ఆహా..' అని ఆశ్చర్యపోవల్సిందే!

ధరలు చుక్కలను దాటినా, సామాన్యులు హాహాకారాలు చేసినా, జగడాలూ జంజాటాలూ ఎన్ని చుట్టుముట్టినా- 'అంతా అమ్మ దయ' అని- ప్రశాంతంగా ఉండగలిగిన ప్రతిభ రాయలుకు ఒక్కసారి కూడా సాధ్యమై ఉండదు. దరిమిలా రోశయ్య తన హయాం రాయలు రాజ్యం కన్నా ఎంతో మిన్న అని మురిసిపోవొచ్చు! ఇంకా అనుమానం తీరకపోతే - కాస్త ఓపిక చేసుకొని- 'రాయలు కాలం' కళ్లారా చూసుకోవొచ్చు. జలయజ్ఞం శిలాఫలకాలూ, ఇందిరమ్మ అసంపూర్ణ ఇళ్ల పథకాలూ ... రాష్ట్రం నిండా రాళ్ల గుట్టలుగా కనిపిస్తాయి. తేడా అల్లా రాయలవారు ప్రారంభించిన చెరువులు పూర్తయ్యాయి. ఇప్పుడు ప్రాజెక్టులు ప్రారంభం అవుతున్నాయి. ఆ పేర ప్రజాధనం కాంట్రాక్టర్ల, అధికార పార్టీ ప్రముఖుల బొక్కసాల్లోకి నడిచి వెళ్తోంది. ప్రాజెక్టులు మాత్రం పూర్తికావడంలేదు.

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
వికాసం	...	7
క్రైమ్‌కథ	...	10
రుచి	...	11
అట్టమీది కథ	...	14
కొత్త పుస్తకాలు	...	17
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4
నాలో నిలిచిపోయిన 'అమ్మ'



విజ్ఞాన వీచిక ... 8
జనాభివృద్ధికి ఓ రోజు

సినిమా కబుర్లు ... 20
మసకబారిన క్యారెక్టర్ పాత్రలు



అందరూ చదవాల్సిన వ్యాసం

జూన్ 27 సంచికలో 'మధుర మీనాక్షి ఆలయ విశేషాలు' అలరించాయి. నాయక రాజుల నాటి శిల్పకళా వైశిష్ట్యం మీనాక్షి దేవాలయం. తంజావూరు బృహదీశ్వరాలయం వంటి దేవాలయాల చరిత్ర మహోన్నతం. ఇది అందరూ చదవదగిన వ్యాసం.

ఆచార్య నూతి నారాయణరావు, హైదరాబాద్.

చైతన్యపరిచిన 'ఆటా ...వేటా'

'కమ్యూనిస్టు ప్రణాళిక'లోని విషయాలు ఏ దేశానికైనా అన్వయించుకోవచ్చు. శ్రామిక వర్గానికి, సమ సమాజానికి కరదీపిక. విరసంతో పెరిగిన కె.శివారెడ్డి కవితలు శ్రామిక వర్గ దృక్పథం కలవి. సామాజిక ప్రగతికి దోపిడీ పీడనలు నిర్మూలనకు సైద్ధాంతిక ఆయుధం కమ్యూనిస్టు ప్రణాళికే. అది అజరామరం. కవర్ స్టోరీ 'ఆటా క్రూర వేటా' వ్యాసం సామాజిక చైతన్యం గలది. విజ్ఞానదాయకమైన పోటీలు ఎన్నైనా నిర్వహించవచ్చు. ఆట పేరుతో పిల్లలతో వ్యాపార క్రీడ కొనసాగిస్తున్నారు. ఇది పచ్చి దుర్మార్గం. పిల్లల హక్కులు హరించినట్లే. చాలా జుగుప్సాకరమైన డాన్సులు పిల్లలతో వేయిస్తున్నారు. నేటి ప్రపంచీకరణలో తేలికగా డబ్బు సంపాదించే మార్గం ఈ ఆట రియాల్టీషో. ఇది వినోదం కాదు. వ్యాపారం. పెట్టుబడిదారీ సంస్కరణలకి ఇవి చిహ్నాలు. పిల్లల తరుపున పెద్దలు ఒప్పందాలు చేయడం ఇద్దెక్కడి సంస్కృతి?

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

పరిచయ వాక్యాలేవీ?

మాఖియవెల్లి గురించి వివరిస్తే బాగుండేది. అసలు కంటే కొసరు ఎక్కువ. పాఠకులకు మాఖియవెల్లి తెలిసినట్లు, పరిచయమున్నట్లు రాసినట్లు అగపడుతున్నది. మాఖియవెల్లి గురించి చాలా విషయాలు తెలియవు కనుక పరిచయ వాక్యాలు రాస్తే బాగుండేది. ముఖ్యంగా రాచరికపు కుట్రలు బహిరంగ పరిచినందుకు మాఖియవెల్లి జైలు శిక్ష కూడా అనుభవించినట్లు తెలుస్తున్నది. అందువల్ల మాఖియవెల్లిలో సెటైర్ గురించి కూడా తెలుసుకోవడానికి వీలయ్యేది. మిగతా విషయాలు వర్తమానానికి అన్వయించడం బాగానే వున్నాయి.

విజయకుమార్, జమ్మిచెట్టు, విజయవాడ.

ఆటకు ఫుల్‌స్టాప్ పెట్టాలి

హక్కులవాది కన్నాబిరాన్‌పై భిన్నాభిప్రాయాలు బాగా రాశారు. ఈ దేశంలో ఇంతకన్నా గొంతెత్తి ఎవరూ మాట్లాడలేరు. తక్కువ లోపాలతో చైనా ప్రభుత్వం ఘనంగా ముందుకు పోతోంది. అద్భుత శిల్పాల రమ్యతతో, మీనాక్షి దేవాలయం, శ్రీరంగ గాలిగోపురం, వేయిస్తంబాల గుడి అత్యంత రమణీయం. ఆట పేరుతో ఆడుతోన్న క్రూర వేట ఇకనైనా ముగిస్తే బాగుంటుంది. ఇదెక్కడి పార్కండీ బాబు. ఇంత భయంకరంగా వున్నాయి ఆ బొమ్మలు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

నిద్రలేపిన వ్యాసం

జూన్ నెల చివరి సంచికలో అట్టమీది కథగా దేవి అందించిన ఆటా... క్రూర వేటా! ఆలోచనాత్మకంగా వుంది. విజ్ఞులు, మేధావులు, మానవహక్కుల సంఘం ద్వారా నిలుపు చేసినా ఆటను కోర్టును ఆశ్రయించి మరీ ఆ తైతక్కలాటను మళ్లీ ప్రారంభించారు. మేమింతే, మేం మారం అన్న చందాన పిల్లల జీవితాలతో ఆటలాడుతున్న వాళ్లను నిద్ర నటించే వాళ్లను నిద్రలేపినట్లే వుంటుంది. చాలా రోజులకు కనిపించిన 'తెల్సా' శీర్షికకోసం మేం ఎదురుచూడనివారం లేదు. ఎన్నో చిత్ర విచిత్ర వింతలు, విశేషాలను చదివి తెలుసుకునే అవకాశం తెల్సా ద్వారానే లభిస్తుంది. బాల నేస్తాలు సరికొత్తగా వుంటోంది. 'పార్కంటే ఇదే' రంగుల బొమ్మలతో ఆకట్టుకుంది. పి.ఆర్ సుభాష్ చంద్రన్ 'తెలుసుకుందామా' ద్వారా ఉదహరించిన చైనాను చూసి భారత్ నేర్చు కోవాల్సింది చాలానే వుందనిపించింది. 'చూద్దామా' ద్వారా మీనాక్షి ఆలయాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన అనుభూతిని పొందాం. 'మనలో మాట' ఎంతో సత్యం. మనకు అన్నం పెట్టే రైతుకు, అన్నదాతకు మనం ఇచ్చే ప్రతిఫలం 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించడం' అంటే ఇదేనేమో!

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

చూసిన అనుభూతి కల్గింది

చూద్దామా పేజీలో నాయక రాజుల కాలంనాటి మధుర మీనాక్షి ఆలయం గురించి చదివిన తర్వాత మాకు అక్కడికి వెళ్లి చూసిన అనుభూతి కల్గింది. అక్కడికి తప్పక వెళ్లి అన్నీ తిరిగి చూసిరావాలనిపించింది.

కామిడి సతీష్‌రెడ్డి, వరంగల్.

సైకిల్‌కార్ బాగుంది

ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'ఆటా... క్రూర వేటా!' చాలా బాగుంది. పిల్లలు మానసిక వేదనకు గురౌతున్నారు. బడికి వెళ్లాల్సిన పిల్లలను డాన్సుల పేరుతో విచిత్ర వేషాలతో, నృత్యాలతో వాళ్లని క్లబ్ డాన్సర్లుగా తయారు చేస్తున్నారు. దీనివల్ల వారి తల్లిదండ్రులకి ప్రస్తుతం వచ్చే లాభం కన్నా, భవిష్యత్తులో వచ్చే నష్టాలే ఎక్కువనే సంగతి తెలియడం లేదు. అలాగే 'తెల్సా' ద్వారా పరిచయం చేసిన సైకిల్ కార్ బాగుంది. 'బాలనేస్తాలు'లో



కొబ్బరిచిప్పలతో తబలాని తయారు చేసే విధానం చాలా చక్కగా వివరించారు. పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. చూద్దామా ద్వారా మీనాక్షి ఆలయాన్ని, వేయి స్థంభాల గుడిని వివరించారు. చివరి పేజీలోని గురుశిష్యుల కథ, పార్కంటే ఇదే లో భయంకరమైన బొమ్మలు బాగున్నాయి. ఇలాంటి సన్నివేశాలతో వారంవారం అందించాలిన కోరుతున్నాం.

అనుపోజు సంతోషి నాగరాజు, విజయనగరం.

రుచి సూపర్

ప్రజాశక్తి ఆదివారం స్నేహలో ప్రచురించిన 'ఆటా... వేటా' వ్యాసం బావుంది. చానళ్లలో ప్రసారమౌతున్న 15 ఏళ్ల లోపు పిల్లల రియాల్టీ షోలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా వాళ్లలో ఎంటువంటి స్పందనా లేదు. ఈ షోల వల్ల అందులో పాల్గొనే పిల్లలు మానసిక వేదనకు గురవుతున్నారు. వారు చదువుకోడానికి కూడా కొంత సమయం కావాలి. ఈ షోలను స్పాన్సర్ చేస్తున్న వారిపై కూడా తగు చర్యలు తీసుకోవాలి. తెలుసుకుందామా ద్వారా చైనా గురించి, చూద్దామా ద్వారా మీనాక్షి ఆలయం గురించి చక్కగా వివరించారు. కె. అరుణ రాసిన రుచి ఐటమ్స్ బాగున్నాయి. చివరి పేజీలోని పార్కులోని దృశ్యాలు చాలా బాగున్నాయి.

ఎ.సంతోషికుమారి, విజయనగరం.

★

తెల్సా!

లావెక్కాలని...

ఇప్పుడంతా జీరో సైజ్ కోరుకుంటున్నారు. బాలీవుడ్ నటి కరీనా నుంచి కాలేజ్ అమ్మాయిల వరకు ఇదే వరస. అది వద్దు, ఇది వద్దు అనడం, విపరీతంగా వ్యాయామం చేయడం చూస్తున్నాం. అయితే దీనికి భిన్నంగా ఆలోచించే వారొకరున్నారు. అదే బాస్! సన్నగా అవ్వాలనుకునేవారికి భిన్నంగా ఆలోచించడమంటే ఏంటి? లావు కావాలనుకోవడం. ఇంతకీ వెరైటీ వ్యక్తి ఎవరా అనుకుంటున్నారా? డోనా సింప్సన్ అనే ఆవిడ మాత్రం ప్రపంచంలోకెల్లా బరువాటి మహిళగా పేరు తెచ్చుకోవాలనుకుంటోంది. అందుకుగాను తనదైన స్టైల్లో లాగించేస్తోంది. ప్రస్తుతానికి 272 కేజీల బరువుంది. 453 కేజీల బరువు కావాలని ఆమె కోరిక. ఇప్పటికే ఆమెను బోలెడంతమంది ఇంటర్వ్యూలు చేశారు. అనేక చానళ్లు ఆమె కథనాలను ప్రసారం చేశాయి. డోనాకు ఇద్దరు పిల్లలు. ఒకరికి 3, ఒకరికి 14 సంవత్సరాలు. అయితే తన అనుభవాలను క్రోడీకరించి ఒక పుస్తకం రాయమని అడుగుతున్నారంట. ఆపనికూడా చేసేస్తానంటోంది సునాయాసంగా.



పాప్ మాంత్రికుడికి నివాళి

పాప్ మాంత్రికుడు మైఖేల్ జాక్సన్ చనిపోయి అప్పుడే సంవత్సరం పూర్తయింది. మైఖేల్‌ను, అతని ఆట పాటను గుర్తు చేసుకుంటూ ప్రపంచవ్యాప్తంగా అభిమాన కోటి బోలెడన్ని కార్యక్రమాలు నిర్వహించాయి. చానళ్లు అతని ఆల్బమ్స్ ప్రసారం చేశాయి. అయితే జర్మనీకి చెందిన సైకిల్ డిజైనర్ 'డిడి సెన్స్' మాత్రం వెరైటీగా ఓ యాత్ర చేశాడు. అదేమంటే మైఖేల్ గుర్తుగా ఓ బైక్ తయారుచేశాడు. దాని మీద 13 రోజులపాటు యూరప్‌లోని రాజధాని నగరాలను సందర్శించాడు. ఇలా పాప్ రారాజు... మైఖేల్‌కు నివాళులర్పించాడు.

95.5 కేజీల బర్గర్

కొందరికి రికార్డులు సృష్టించడమంటే సరదా. అదొక హాబీ కూడా. ఈసారి మనం చెప్పుకోబోయేది పెద్ద బర్గర్ తయారుచేసిన వారి గురించి. అయితే ఈసారి ఈపని చేసింది సిడ్నీలో ఓ రెస్టారెంట్‌వారు. ఇంతకీ వీరు తయారుచేసిన బర్గర్ బరువు ఎంతనుకుంటున్నారు? 95.5 కేజీలు. ఇందుకుగాను 120 గుడ్లు, 16 టమాటాలు, 120 జున్ను ముక్కలు, 21 కేజీల బ్రెడ్డు ఇంకా రెండు కిలోల ఆకుకూరలు, అర కేజీ సాస్ వాడారు. అయితే దీన్ని తయారు చేయడానికి 12 గంటల సమయం పట్టిందట. మరి రికార్డు చేయాలన్నా బద్దలు కొట్టాలన్నా అంత ఈజీ కాదు. కాస్త ఓర్పు, నేర్పు అవసరంకదా.



బుల్లి ఏనుగు

ఏనుగులు మామూలుగా చాలా సాధు జంతువులు. ఆ 'ఒక్క' సమయంలో తప్ప. గున్న ఏనుగులైతే మరీ ముద్దుగా, అమాయకంగా కనిపిస్తాయి. అయితే అప్పుడే పుట్టిన ఏనుగుల్ని చూస్తే బొమ్మ ఏనుగే గుర్తొస్తుంది. కానీ... మనకు అంత మంచి అవకాశం రాదనుకోండి. సాధారణంగా ఏనుగు గర్భధారణ కాలం 22 నెలలు. ఈ బొమ్మలో కనిపిస్తున్న ఏనుగుపిల్ల మాత్రం మామూలుగా కంటే ముందే పుట్టేసింది. అందుకే చాలా తక్కువ బరువుంది. దాన్ని జూ (ఎక్కడో ఏమిటో మాత్రం అడక్కండి) అధికారులు ప్రాణప్రదంగా కాపాడుకొస్తున్నారు. అది ఆరోగ్యంగా పెరిగి పెద్దదవ్వాలని కోరుకుందాం.

స్ఫూర్తి

- చాగంటి తులసి
ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు.



నాలో నిలిచిపోయిన 'అమ్మ'

మంచి పుస్తకాలు, ముందుచూపున్న మంచి ఆలోచనలు, ఉత్సాహాన్నిస్తూ ఉద్రేకపర్చే పాటలూ, పద్యాలు, ఊహాసామర్థ్యాన్ని పెంచే కథలూ, కబుర్లు, పండగలూ, పబ్బాలు, సంప్రదాయ వంటలు, కేరింతలతో భోజనాలు, నానా రకాల యాసగొంతులు, కొత్తకాంతులు, మూడుతరాల ఆడామగా కలగలపు మాటలు, కొత్తా పాతల చల్లగాలులు, మంచి పెరకువకు కావాల్సిన మట్టీ, నీరు, వెలుగు అన్ని విధాలా సారవంతమే. వేళ్ల దించుకుని దృఢంగా నిఠారుగా నిలబడ్డానికి కావాల్సింది లేనిదేదీ లేదు. ఇదే నేను పెరిగిన వాతావరణం!

చాసో నారాయణబాబు, రోణంకి అప్పలస్వాములు గొంతెత్తి ఎన్నెన్నో తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచి పద్యాలు, పాటలు, గేయాలు గట్టిగా పాడ్డం, ఆ శ్రవ్య దృశ్య అనుభూతి ఇప్పటికీ తాజాగా ఉంది!

కంటితో చదువుకోవడం కవిత్వానికి అస్సలు పనికిరాదు. నిజానికి గద్యం కూడా పైకి గట్టిగా ఉచ్ఛరిస్తూ చదవడం మంచిది. కథ రాసిన తర్వాత కాదు ఏది రాసినా పైకి గట్టిగా చదివి రాసుకున్నది నా చెవితో నేను వినడం నాకు అలవాటు. ఈ అలవాటుకు పునాది చాసో, రోణంకి నారాయణబాబుల గొంతెత్తి పాడిన పాటల శ్రవ్య, దృశ్య అనుభూతే! చెవి మన రాతలోని తప్పుల్ని ఎత్తి పట్టుకుంటుంది. బాగులేదని చెప్తుంది. దిద్దుకోమంటుంది!

గురజాడ, నారాయణబాబు, శ్రీశ్రీ గేయాలు పాడుకుంటున్నా నాకెందుకో గద్య రచనల పట్లే ఎక్కువ దృష్టి ఉండేది. కథలూ, నవలలు ఎక్కువ చదివేదాన్ని. తోరూదత్, సరోజనీ నాయుడి కవిత్వాన్ని పాడుకుంటూ 21 ఏళ్లకే తోరుదత్ కవయిత్రిగా పేరు తెచ్చుకుందే, నేనా వయసుకు గొప్పది ఏం రాయలేదే అని తాను తపనపడ్డట్టు చాసో చెపుతూ ఉండేవాడు. ఆ చిన్నతనంలో చాసోలా నేనేదో రాసేసి గొప్ప రచయిత్రిని అవ్వాలని అనుకోలేదు. నాకు అలాంటి తపన ఏం కలగలేదు. కాని చుట్టూ ఉన్న పరిసరాలను మర్చిపోయి పుస్తకాల్లో లీనమైపోయేదాన్ని. ఇంటి వాతావరణం, పుస్తకపఠనంతో నాకు తెలియకుండానే ఏది రాయాలో ఎలా రాయాలో ఎందుకు రాయాలో మనస్సుమీద ముద్రపడుతూ వచ్చింది. అంటే కాన్షస్‌గా పట్టుబడాలని పట్టుకోవాలని నేర్వాలని నేర్చుకుంటూ చదివిన చదువు కాదు.

పెద్దయ్యాక ఇదీ అదీ అని కాక అన్నింటినీ ఇష్టంతో చదువుకోవడం మొదలైంది. ఏది నన్ను విశేషించి బంకలా ఎవరు నన్ను గట్టిగా ఆకట్టుకున్నారూ! వేమనా, కబీరా, గురజాడా, ఫకీర్‌మోహనా! కాజీనజ్రుల్ ఇస్లామా నారాయణబాబా! శ్రీశ్రీ నా సచ్చిదానంద రావు తరాయా? ప్రేమ్‌చందా, గోర్కీనా! చెకోవా చాసోనా? వీళ్లంతా నాలో ధ్వనిస్తున్నారా? అవును! వీళ్లందరూ నా వాళ్లే! నేను వీళ్లలో దాన్నే. May our Tribe increase!!

ప్రక్రియల్లో కథంటేనే నాకు ఇష్టం. చిన్న పరిధిలో జీవితాన్ని లోతులతో చిత్రించడం కష్టం. కష్టం కనకే ఇష్టం. అలాగే గోర్కీ అంటే ఇష్టం. గోర్కీ 'అమ్మ' అంటే ఇష్టం. ప్రేరణాస్ఫూర్తి అని వెనక్కి తిరిగి ఆలోచిస్తే నేను రాసిన వాటిని మరొకసారి మరొకసారి తలచుకుని చూస్తే 'అమ్మ' నాలో నిలిచింది అనీ, గాఢంగా ముద్ర పడిందని అనిపిస్తోంది. చిన్నకథలు రాయడం ఇష్టపడే నేను 'అమ్మ' నవల నుంచి ఏమిటి నేర్చుకున్నానుట!!

నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం. అయినా పరపీడన పోవాలి. గడ్డిపరకలు తమను తాము తెలుసుకుని తలలెత్తాలి. మనిషిలోని మనిషితనాన్ని ముట్టుపెడుతున్న క్రూరశక్తులను ఎదుర్కోవాలి. పెట్టుబడి, పెత్తనంపై తిరగబడాలి. మానవసంబంధాల్లో సానుభూతి, అవగాహన, సమైక్యత, ప్రేమ, కరుణ న్యాయంతో కూడిన ఉజ్వలమైన జీవిత వాస్తవికత నిజం కావాలి. ఆ దిశగా రచయితల రచనా ప్రస్థానం సాగాలి. కథగా రాసినా, కావ్యంగా రాసినా, నవలగా రాసినా, నాటకంగా రాసినా, రచనా ధ్యేయం అదే అవ్వాలి. అన్యాయానికి బలి అవుతున్న దిక్కుమాలిన దౌర్భాగ్యపు స్త్రీ, పురుషులు కొత్త మనుషులుగా రూపొందాలి.

మనకు వాస్తవ జీవితంలో తారసపడిన వ్యక్తులను నమూనాగా తీసుకోవాలని, ఆ నమూనాతో మన ఊహాసామర్థ్యంతో పాత్రను సృష్టించుకుంటే ఆ పాత్ర సహజమైందిగానూ, మొత్తం ప్రపంచానికి చెందినదిగానూ సంతరించుకుంటుందని గోర్కీ 'అమ్మ'

ప్రక్రియల్లో కథంటేనే నాకు ఇష్టం. చిన్న పరిధిలో జీవితాన్ని లోతులతో చిత్రించడం కష్టం. కష్టం కనకే ఇష్టం. అలాగే గోర్కీ అంటే ఇష్టం. గోర్కీ 'అమ్మ' అంటే ఇష్టం. ప్రేరణాస్ఫూర్తి అని వెనక్కి తిరిగి ఆలోచిస్తే నేను రాసిన వాటిని మరొకసారి మరొకసారి తలచుకుని చూస్తే 'అమ్మ' నాలో నిలిచింది అనీ, గాఢంగా ముద్ర పడిందని అనిపిస్తోంది. చిన్నకథలు రాయడం ఇష్టపడే నేను 'అమ్మ' నవల నుంచి ఏమిటి నేర్చుకున్నానుట!!

నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం. అయినా పరపీడన పోవాలి. గడ్డిపరకలు తమను తాము తెలుసుకుని తలలెత్తాలి. మనిషిలోని మనిషితనాన్ని ముట్టుపెడుతున్న క్రూరశక్తులను ఎదుర్కోవాలి. పెట్టుబడి, పెత్తనంపై తిరగబడాలి. మానవసంబంధాల్లో సానుభూతి, అవగాహన, సమైక్యత, ప్రేమ, కరుణ న్యాయంతో కూడిన ఉజ్వలమైన జీవిత వాస్తవికత నిజం కావాలి. ఆ దిశగా రచయితల రచనా ప్రస్థానం సాగాలి.

పాత్ర వల్లే తెలిసింది. ఏ దేశపు ప్రజలైనా ఆ పాత్రనీ, ఆ పాత్ర స్వభావపు విశిష్ట గుణాన్ని తమదిగా భావించి ఆ పాత్రలో తమను తాము చూసుకోవడానికి వీలు కలుగుతుందన్న ఎరుకా కలిగింది. మారుతున్న సమాజంలో కొత్తగా పుట్టుకు వస్తున్న వ్యక్తులను రచయిత పట్టుకోగలగాలి అని, వారిని పాత్రలుగా ఎంపిక చేసుకుని తమ ప్రతిభతో సన్నివేశాలను కల్పించుకుని రచన చేయాలన్న జ్ఞానమూ కలిగింది. కొత్తగా పుట్టుకు వస్తున్న ఈ కొత్త వ్యక్తులు కొత్త ఆలోచనలతో వ్యవస్థ మార్పుకు సమాజ జీవితానికి కొత్త రూపు, కొత్త చూపు ఇవ్వగలిగిన వారు. వీరు పునర్నిర్మాణానికి ఆధారశిలలు. వీరి ఆలోచనలు, వీరి క్రియాకలాపాలు, వీరి జీవనవిధానాలు మరికొంతమందికి మార్గం చూపేవిగానూ, అటువంటి సంఖ్య పెంచేవిగానూ ఉంటాయి. పాత పద్ధతుల్లో, పాత అలవాట్లతో, సాంప్రదాయాలతో ఆలోచనలతో చట్టంలో ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్న వ్యక్తుల ఎదుగుదలకు వారిని కదిపి కుదిపే సంఘటనలూ ఘర్షణలు ఉండాలి. ఆ తాకిడి పెనుతాకిడి అవ్వాలి. వారు తమలో తాము మదనపడాలి. తమలో తాము వ్యాఖ్యానించుకోగలగాలి. కొత్తకీ, పాతకీ గల తేడాలను బేరీజు వేసుకోగలగాలి. చెడ్డను గుర్తించినా, గమనించినా దానివల్ల వేదనాభరితమైన బతుకు బతుకుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయత వల్ల దానికి లొంగిపోయే ప్రవృత్తి నుంచి బయటపడ్డానికి కావాల్సిన అంతరదృష్టి వికసించాలి. ఉపేక్షాభావం, ఇది అంతే అనే నిస్పృహ పటాపంచలు కావాలి.

తమస్థాయికి తగ్గట్టూ తమ ముందున్న కొత్త పరిస్థితులకు, కొత్త వాతావరణానికి ప్రభావితం అవుతూ క్రమానుగతంగా మార్పు చెందుతూ కొత్త వ్యక్తిత్వంతో తమ మార్గదర్శకులతో పాటు వారి కన్నా ఎక్కువ శక్తివంతంగా కార్యోన్ముఖులు కావాలి. విషాదకరమైన హృదయ విదారకమైన, అవమాన భరితమైన జీవిత వాస్తవాలను కొత్త దృష్టితో చూసి వాటి విరుగుడుకు నడుం కట్టాలి. ఆ పాత్రలను ఈ పాత్రలను ఒకదాని పక్క మరొకటి పెట్టుకుంటూ చిత్రిస్తే ఆయా పాత్రల వ్యక్తిత్వాలు మూర్తిమంతాలై కళ్లకు కడతాయి. ఇలాంటి కళాత్మక చిత్రణకు కావాల్సిన కిటుకు 'అమ్మ'వల్లే–గోర్కీవల్లే బోధపడ్డది. వ్యక్తుల రూపురేఖలతో బాహ్యవర్ణన అంత ప్రధానంగా సూక్ష్మ వివరణలతో చేయక పోయినా నష్టం లేదు. కాని ఆయా పాత్రలు సంభాషణల ద్వారా వ్యక్తపర్చుకునే అభిప్రాయాలు, వారి క్రియా కలాపాలు ముఖ్యం. అవసరమైన చిన్న వివరణ జోడిస్తే చాలు ఆ వ్యక్తి మన ముందు ప్రత్యక్షమై కనబడతాడు. మన కంటికి కనబడుతూ మరచిపోదామన్నా మరుపుకు రాని విధంగా మన మనసును వెంటాడతాడు. ఇదీ అద్భుత చిత్రణ. ఇలాంటి చిత్రణ ఎలా చేయాలో గోర్కీ 'అమ్మ' చెప్పక చెప్పింది. అంటే వస్తువూ, వస్తువును తీర్చిదిద్దే పద్ధతి, రెండింటి గురించిన అవగాహన కలిగించింది.

నా కథలలో మారుతున్న సమాజంలో కొత్తగా పుట్టుకువచ్చిన స్త్రీపాత్రల ఎంపికా చిత్రణ వెనుక గోర్కీ ప్రేరణా, స్ఫూర్తీ ఉన్నాయి. విప్లవాత్మకమైన ముందు అడుగువేసే పాత్రలతో కొత్త వ్యక్తిత్వాల ఎదుగుదల చిత్రణతో వాస్తవ జీవితంలో తారసపడిన వ్యక్తుల నమూనాలతో క్యారెక్టర్‌ను పట్టుకొని రాసినవి. సంఘటనల, సన్నివేశాల కల్పన ప్రధానమైనదిగా తయారవ్వడానికి ముందు క్యారెక్టర్ పట్టుకోగలగడం ముఖ్యం. క్యారెక్టర్ లోంచి కథ పుట్టాలి. అలా అని ఎవరో ఒక వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని ఆ వ్యక్తి మీద అల్లుకున్న కథలు కావు. అలాంటి వ్యక్తులనందరినీ ఏకం చేసి ఒకానొక కల్పిత వ్యక్తిని పాత్రగా మలుచుకొని రాసిన కథలు, అందుకే ఆయా వ్యక్తులు ఆ పాత్రలో తమను తాము చూసుకోగలుగుతున్నారు. ఇదీ గోర్కీ లోంచి వచ్చిన పాఠం.

నేను రాసిన 'యాష్–ట్రే' కథలోని స్త్రీపాత్ర మారుతున్న సమాజంలో కొత్తగా పుట్టుకు వచ్చిన పాత్ర. మధురాంతకం రాజారాం గారు ఆ పాత్రను పాత మూసలో వెనక్కు అడుగు వేసే విధంగా ముగింపు ఇస్తే బాగుండు అంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కొత్త పాత్రలు వెనక అడుగు వెయ్యవు. ఈ కథలోని పాత్రకూ 'చిన్న దేవేరి' కథలోని పాత్రకూ పేరు కూడా పెట్టకుండా రాయడంలో ఉద్దేశం అప్పుడప్పుడే తయారవుతూ వస్తున్న ఈ వ్యక్తుల సంఖ్య పెరిగి ఎదిరింపు నిరసనలతో కొత్త వ్యక్తిత్వాన్ని సంతరించుకొని వ్యవస్థ మార్పుకు కొత్త సమాజపు నిర్మాణానికి పునాదులు అవ్వాలనే!

ముఖ్యంగా నేను రాసిన 'యాత్ర' నవలిక అల్లికలో పాత్ర చిత్రణలో గోర్కీ 'అమ్మ' మారిందని ఇప్పుడు నాకు అనిపిస్తోంది. రాసినప్పుడు ఈ అంశం ఒకటి ఉన్నదన్న స్పృహ నాకు లేదు. మనకు తెలియకుండానే మనం ఆర్జించుకున్న జ్ఞానం, తెలివిడి, ఎరుక, తాత్వికత అప్రయత్నంగా రచనలో తనకు తాను పొందుపర్చుకుంటుందన్న మాట. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి మనను మనమే పరిపాలించుకున్నప్పుడు మన సమాజంలో జాతి మత కుల బేధాలు సమసిపోయి గణతంత్రమై వ్యవస్థను చక్కని కొత్త రూపు పొందుతుందని ఆశపడ్డాం. ఎన్నికల రాజనీతి జాతి మత కులాల ప్రాతిపదిక మీద నడుస్తూ వాటినన్నింటినీ పరిరక్షించే శక్తులు మరింత బలపడేలా చేస్తోంది. మన విధానాలు పెట్టుబడిదారీ వ్యవస్థ బిగుపట్టులో ఉన్నాయి. మన సమాజం ప్రసిద్ధ హిందీ నవలా రచయిత రాంగేయ్ రాఘవ అన్నట్టు అధూరాకిలా (అసంపూర్ణకోట)లాగే ఉంది! తథా కథిత తక్కువ జాతులవారు, వెనుకబడ్డవారు, వివక్షకు అవమానాలకు గురవుతున్నారు. సమూహాలుగా విడివడి ఎలుగెత్తి ఇది ఎప్పటివరకు అని అరుస్తూ అడుగుతున్నారు. ఒక్కొక్క సమూహానికి ఒక్కొక్క 'అమ్మ' పుట్టుకువస్తున్నట్టుగా కనబడుతోంది! ఎన్నో రూపాల్లో పిశాచాలు. పరిసరాల నిండా పిశాచాలు. పీక్కుతింటున్న పిశాచాల పీచమణచడానికి చేసే ప్రయత్నాల్లో కీచుగొంతుకల అరుపులు, How long do I call! కబ్‌తక్ పుకారూ? అని రాంగేయ్ రాఘవ కలంలో దూరి అడుగుతున్నారు. ఎలుగెత్తిన గొంతులు గింగురు పెడుతూనే ఉంటాయి. గింగురులు పెద్దమోతగా మారి దిక్కులు బద్దలయ్యే మోతగా రోదసి పగిలేటట్టు మోగుతూనే ఉంటుంది. విడివిడిగా ఏర్పడుతున్న వేరువేరు 'అమ్మ'లందరూ ఒకే 'అమ్మ'గా క్రమానుగతంగా మారేంతవరకు ఈ ధ్వని తరంగాలు ప్రసరిస్తూనే ఉంటాయి. గమ్యం చేరేవరకూ 'అమ్మ' ప్రస్థానం సాగుతూనే ఉంటుంది. ప్రేరణా స్ఫూర్తీ ఇస్తూ తనతో కలిసి అడుగులు వేస్తూ నడవమంటూనే ఉంటుంది. ★

తమస్థాయికి తగ్గట్టూ తమ ముందున్న కొత్త పరిస్థితులకు, కొత్త వాతావరణానికి ప్రభావితం అవుతూ క్రమానుగతంగా మార్పు చెందుతూ కొత్త వ్యక్తిత్వంతో తమ మార్గదర్శకులతో పాటు వారి కన్నా ఎక్కువ శక్తివంతంగా కార్యోన్ముఖులు కావాలి. విషాదకరమైన హృదయ విదారకమైన, అవమాన భరితమైన జీవిత వాస్తవాలను కొత్త దృష్టితో చూసి వాటి విరుగుడుకు నడుం కట్టాలి. ఆ పాత్రలను ఈ పాత్రలను ఒకదాని పక్క మరొకటి పెట్టుకుంటూ చిత్రిస్తే ఆయా పాత్రల వ్యక్తిత్వాలు మూర్తిమంతాలై కళ్లకు కడతాయి. ఇలాంటి కళాత్మక చిత్రణకు కావాల్సిన కిటుకు 'అమ్మ'వల్లే–గోర్కీవల్లే బోధపడ్డది.

కవిత్వమ్

పేదరికపు బాంధవ్యం

పేదరికపు వెంట అడుగు వేయని నీకు
అర్థం కావు ఆమె రూపురేఖలు
పొడవు వెడల్పు లోతు విస్తారాలు
గుంటలు పడ్డ కళ్లకు వాడిన చెక్కిళ్లకు
నీ వేళ్లను చేర్చడానికి మార్గదర్శకులెవరూ ఉండరు
నీ ముద్దు మోము ఇల్లాలు
చిక్కి, కృశాంగియై, ఎద ఎండి శుష్కించి
పేదరికపు రూపు రేఖలు
ఆమె ముఖంలో పొడచూపే వరకు!

ఎక్కడో దూరాన అపరిచిత జనావాస నగరంలో
పరాయి ముఖాల్లో, కనిపించిన సుద్దుల తునకల్లో
భోజనం లేని ఖాళీ కంచంలో
నిర్జీవమైన నల్లటి చేతుల్లో
ఎగిరి గంతులేసే పేదరికం
ఒక కరాళరాత్రి
కిటికీ కావల నీవు తొంగి చూసినప్పుడు
నీ పెరట్లో బాసింపట్లు వేసుకుని
కూర్చున్న దృశ్యం కనిపిస్తుంది
మరుసటి ఉదయం
అద్దంలో నిన్ను నీవు చూసుకున్నప్పుడు
పేదరికం నీకెన్నడూ పరాయిగా అనిపించదు
అదిప్పుడు నిన్నే యజమానిని చేసుకుని



భుజమెక్కి కూర్చున్నప్పుడు నీకథ దారి తప్పి
ఇల్లాలి కంఠం కర్కశమైనట్టు అనిపిస్తుంది!

ఇక నీవు, నీ వాళ్లు, సుఖపు రుచుల
బతుకు బతక లేరు-
కేవలం బతుకు మాత్రమే 'బతుక' గలరు!

మూలం: లూసి స్మిత్
తెనిగింపు : **రంగనాథ రామచంద్రరావు**

బాలలు - విద్యాహక్కు

పల్లవి : పసిమిపాల వయసులోనే పలకా..... బలపం వదిలి
పనిలో కుదిరిన బిడ్డా.... హక్కొచ్చిందీ..... విద్యాహక్కొచ్చిందీ......
ఇన్నాళ్లకు మనవాళ్లకు తెలివొచ్చింది.... బిడ్డా.... తెలిసొచ్చింది..... ॥పసిమి॥

చరణం1 : ఊరిలోని చదువు తీరు వేరువేరు దారులాయె
వాడవాడ బడులు వెలసి ఉమ్మడి బడి ఉడిగిపోయె

చదివే చదువుల్లో కుడి ఎడమల దూరమాయె
గడిపే బతుకుల్లో చదువుపోరు భారమాయె

ఈ చదువుల పందెంలో..... గెలిచేదెట్టా...? ఎదిరి నిలిచేదెట్టా...?
అందరికీ విద్యంటే...... నమ్మేదెట్టా....! అది అందేదెట్టా......! ॥పసిమి॥

చరణం2 : హక్కులున్నా గాని చిక్కులెన్నో వుంటాయి
చట్టమంటారు గానీ ఉట్టికెక్కకుండాలి

కాగితాలకట్టల్లో చట్టాలు నలిగిపోక
అందరి హక్కయ్యే ఆదర్శం కావాలి

పేదలగోడు వినే పెద్దమనసు ఉండాలి
మదిమంది చదువు కొరకు ప్రతి ఒక్కరు కదలాలి

అప్పుడే కద బిడ్డా...... హక్కయ్యేది.... విద్య హక్కయ్యేదీ.....
నీబోటి నిరుపేదకు దిక్కయ్యేదీ..... పెద్ద దిక్కయ్యేదీ.... ॥పసిమి॥

చరణం3 : నిను కన్నవాళ్ల చదువు సంతకాన్ని నేర్వలేదు
నీ రెక్కల బరువు ఇంటి బాధ తీర్చబోదు

రోజు కూలీతోటి గాజుబొమ్మ జీవితాలు
తరాలు మారినా..... తలరాతను మార్చలేవు

బతుకంటె బాధ్యతరా.... బండచాకిరీ కాదు
చదువనే సంపద నువ్వు సాధిస్తే విడిచిపోదు

సాగిపోయె చదవు బండి.... నీ కోసం ఆగాలీ... నీకు తోడుగ కదలాలీ....
ఎగుడుదిగుడులెన్నున్నా.... చదువు సాగాలీ.... నీ చదువు సాగాలీ...... ॥పసిమి॥

- గోపీనాథ్

వికాసం

కొంతమంది మహిళలు ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒకటి తుడుస్తూనో, కడుగుతూనో కనిపిస్తారు. తమ ఇల్లు మల్లెపువ్వులా మెరిసిపోవాలనుకుంటారు. పదిమందీ తమ ఇంటి శుభ్రతను గుర్తించాలనీ, అభినందించాలనీ కోరుకుంటారు. గచ్చుమీద ఏ చిన్న మరక కనపడినా దాన్ని శుభ్రం చేసేవరకు వారి మనసు ఊరుకోదు. అయితే దీనివల్ల కొన్ని ఇబ్బందులూ వున్నాయి. అవేంటో వాటిని ఎలా అధిగమించాలో ఈవారం చూద్దాం.

ఎప్పుడూ పనేనా!

మాలతికి ఇద్దరు పిల్లలు. వారు తమ పనులు తాము చేసుకోగల వయసులో ఉన్నవారే. పైగా ఆమె ఉద్యోగం చేయదు. ఎప్పుడు చూసినా ఇంటిపనుల్లో మునిగి ఉంటుంది. రోజు మొత్తం ఏదో ఒక పని చేస్తూ ఉంటుంది. పక్కింటివారు ఆమెను అరుదుగా పలకరిస్తుంటారు. ఎందుకంటే ఆమె ఇంటి పనులలో హడావిడిగా ఉంటుంది. దాంతో బాగా అలసిపోయినట్టుగా కనిపిస్తుంది. ఆమె పరిశుభ్రత పిచ్చితో ఇంట్లో నిరుత్సాహ వాతావరణం ఏర్పడింది.

అందుకే పనంతా పూర్తిగా అయిపోయిన తరువాత హాయిగా కాసేపు కూర్చోవచ్చు అని అనుకోకూడదు. ఎందుకంటే ఒక పని పూర్తి అవగానే మరో పని కనిపిస్తుంది. అది పూర్తి అవగానే మరోటి. అలా ఏదో ఒక పని పుట్టుకొస్తూనే ఉంటుంది. చివరికి ఒంట్లో ఉన్న శక్తి అంతా అయిపోతుంది. కానీ పని తెమిలినట్టు అనిపించదు.

గృహిణికి తన భర్తతో, పిల్లలతో, వారికి అన్ని అవసరాలు తీర్చడంతో, వంటకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకోవడంతోనే ఆమె సమయం కాస్తా అయిపోతుంది. వీటన్నిటితో పాటు ప్రతి రోజూ ఇల్లంతా శుభ్రం చేయాలంటే ఎలా కుదురుతుంది? ఎముకలన్నీ అరిగిపోయేలా చేస్తూ ఉంటే చివరికి శాశ్వత అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. అలా చేయాలని అనుకోవడం అవివేకమవుతుంది కూడా.

ఇది కుటుంబ సంతోషాన్ని హరిస్తుంది. ఇల్లాలు బాధపడడమే కాకుండా తన కుటుంబాన్ని బాధిస్తుంది. ఉదాహరణకు ఏ వస్తువునైనా పెట్టిన చోట నుంచి తీసినా, మురికి కాళ్లతో ఇంట్లోకి వచ్చినా భర్తను, పిల్లలను కోప్పడుతుంటారు. ఏదో ఒకటి సణుగుతూ పనులు చేయడం వల్ల పిల్లలకు టిఫిను పెట్టడం, భర్తకు క్యారియర్ సర్దడం ఆలస్యమౌతుంది. ఇంట్లో తరచూ ఇటువంటివి జరగడం వల్ల ఆ ఇంట్లో కళ తప్పుతుంది.

అమెరికాలో చేసిన ప్రయోగాలను బట్టి శారీరక, మానసిక సమస్యలకు ఇతర కారణాల కంటే రోజువారీ జీవితంలోని విసుగే కారణమని తేలింది. కాస్తైనా విరామం లేకుండా పూర్తి పరిశుభ్రత కోసం పాకులాడడం కంటే మరో అసహాయ స్థితి ఉండదు. కొన్ని పనులు చేయలేకపోతే వారు ఏదో తప్పు చేసిన వారిలాగా బాధపడతారు. తాము ఇంటి కోసం ఏమీ చేయలేని వారిగా, తమ వల్ల ఎటువంటి ఉపయోగమూ లేనట్లుగా మనస్తాపానికి గురవుతారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో రోజంతా కష్టపడడం, గబాగబా నడవడం వల్లే మహిళలకు తీవ్రమైన మోకాళ్ల నొప్పి వస్తుందని కొన్ని అధ్యయనాలలో తేలింది. ఇంటిని అలంకరించడానికి ఎంతో కష్టపడడం వల్ల శారీరకంగా బాగా అలసిపోయి మోకాళ్ల నొప్పి, ఇతర అనారోగ్యం ఏర్పడుతుంది. నిరుత్సాహకరమైన వాతావరణం ఏర్పడి ఫలితం లేకుండా పోతుంది. ఇంటిని శుభ్రంగా ఉంచాలన్న ధ్యాసతో అనవసరపు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వినోదానికి ఉండే కాస్త సమయం కూడా హరించుకుపోతుంది.

ఏ పనీ కాకముందే కాసేపు కూర్చోవడం ఒక మంచి లక్షణం. జాగు చేయకుండా ముఖ్యమైన పనులు అంటే కుటుంబ సభ్యులకు భోజనం వడ్డించడం, గిన్నెలు కడగడం వంటివి త్వరగా చేసుకోవాలి. ఆ తరువాత కాసేపు విశ్రాంతి తీసుకుని ఇతర ముఖ్యమైన పనులు చేసుకోవాలి. పరిశుభ్రత పేరుతో రోజు మొత్తం పని చేస్తూ ఉండకూడదు.

మనకు ఎక్కువగా సమయం లేదనుకున్నప్పుడు ఇల్లు మొత్తం తుడవకుండా మురికిగా ఉన్నచోట తుడుచుకుంటే సరిపోతుంది. చాలా ముఖ్యమైన పనుందనుకున్నప్పుడు ఎక్కువ సమయం తీసుకునేవి కాకుండా త్వరగా అయ్యే వంటకాలను తయారుచేస్తే సరిపోతుంది. పిల్లలను స్కూలుకు పంపడం, మధ్యాహ్న భోజనం త్వరగా చేయడం వల్ల ఎవరికీ ఇబ్బందీ ఉండదు. ఉతకాల్సిన, లేదా ఐరన్ చేయాల్సిన బట్టలు ఉన్నా మనకు సమయం దొరికే వరకు వాటిని ఆపొచ్చు. కాబట్టి ఆ పనుల గురించి హైరానా పడాల్సిన పనిలేదు. గిన్నెలు కడగడం ఒక గంట ఆలస్యమైనా ఫర్వాలేదు కానీ భోజనం ఆలస్యమైతే ఇబ్బంది. కాబట్టి ఒక పద్ధతి ప్రకారం పనులు చేసుకోవాలి. అన్ని పనులూ అప్పటికప్పుడు చేయాల్సిన అవసరం ఉండదు. అప్పటికి కావలసిన పనులు త్వరగా చేసుకోవడం వల్ల ఇంట్లో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. ఈ పద్ధతిని అలవాటు చేసుకోవడం వల్ల బద్ధకం అని అనుకోనక్కర్లేదు. దీనివల్ల పని పట్ల ఇంగిత జ్ఞానం ఉన్నట్టు.

శక్తిని, పనిని బ్యాలెన్స్ చేసుకోవడానికి కొన్ని పద్ధతులను అలవాటు చేసుకోవాలి.

- రోజూ పడుకోబోయే ముందు ఏ పనులు చేశామో వాటిని గుర్తు చేసుకోవాలి. చేయని వాటిని తలుచుకోవద్దు.
- శుభ్రంగా ఉండడం మంచి పద్ధతే కానీ చెప్పులతో కాస్త మట్టి వచ్చిందనో, ఇంటికి వచ్చిన అతిథులు టేబుల్ క్లాత్‌ని మురికి చేశారనో వారికి అసౌకర్యం కలిగించొద్దు.
- మన ఇంటికి వచ్చిన వారు కూడా ఫలానా సమయంలో ఫలానా పద్ధతిలో ఫలానా పనిచేయాలని ఆశించినపుడు వారిని బలవంతం చేసినట్టవుతుంది.
- అస్తమానం చీపురు, బూజుకర్ర పట్టుకోవడం మానేయండి. అప్పుడప్పుడు నడుం వాల్చండి.
- అవసరమైన పనికి మాత్రమే సూచనలను బలపరచుకుని ఇంటి వాతావరణాన్ని ఆనందమయం చేసుకోండి. దీనివల్ల అనవసరపు బాధ్యతల నుండి తప్పించుకోవచ్చు.
- విశ్రాంతి గదిలో, పడక గదిలో పనిముట్లు, ఫ్లవర్‌వాజులు, క్యాసెట్లు, చెప్పుల ర్యాకులు వంటివి పెట్టుకోవద్దు. అవి చికాకును, విసుగును కలిగించి విశ్రాంతికి అవరోధం కలిగిస్తాయి.
- అతిథులు వస్తారనుకున్నప్పుడు ఆ రోజు కొంచెం ఎక్కువ సమయం వెచ్చించి గదులను శుభ్రం చేసుకుని మిగతా రోజుల్లో మనం చేయగలిగిన పని చేసుకుంటే సరిపోతుంది.
- పని గంటలను తగ్గించుకునే దారులు వెతుక్కోవాలి. వత్తిడిని తగ్గించుకోవడానికి అవసరమైన వ్యాయామం చేయడం, సంగీతం వినడం వంటివి చేయాలి.

శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని దెబ్బతీసే పరిశుభ్రత కోసం పాటు పడడం అర్థం లేని పని.

★

చేతిలో పెన్ను, కాగితాలు, భుజాన సంచితో కొందరు మన ఇళ్లకు వస్తున్నారు. కుటుంబ సభ్యులెందరు? పేర్లేంటి? ఏం చేస్తుంటారు? పిల్లలు చదువుకుంటున్నారా? వంటి విషయాలు వివరంగా అడిగి రాసుకెళుతున్నారు. ప్రతి పది సంవత్సరాలకొకసారి జనాభా లెక్కల సేకరణ ఇలాగే జరుగుతుంది. అందుకు మన ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటుంది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జనగణనకు, జనాభాకు సంబంధించి పలు విషయాలు...

జనాభివృద్ధికి ఓ రోజు

- డా॥కాకర్లమూడి విజయ్

ఒక దేశపు అభివృద్ధిలో జనాభా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఒక స్థాయి వరకూ అధిక జనాభా అంటే అధిక ఉత్పత్తి, అధిక ఉపాధి, అధిక బలగం, అధిక బలం అనుకునేవాళ్లు. కానీ మన జనాభా మాత్రం అలా 'ఆస్తి' స్థాయి దాటి ఒక బరువుగా మారిపోయింది. ఒకానొక దశలో మన దేశంలో సగటున ఒక మహిళకు ఆరుగురు సంతానం వుండేది. మొత్తానికి అటువంటి సంతాన ప్రవర్ధనాన్ని కొంతమేరకు అరికట్టగలిగాం. సంతాన అభివృద్ధి రేటు నిముషానికి 2.1కి తగ్గించాలన్న ప్రణాళిక సఫలం కాలేదు. ఆ తరువాత, 2050 వరకు అయినా ఆ లక్ష్యం 2.2కి చేరవచ్చని అంచనా. ఇప్పుడిప్పుడు కొంత మంది చదువుకున్న వాళ్లు ఏక సంతానం వైపు మొగ్గు చూపుతున్నా, ఆ ప్రభావం మొత్తం దేశ జనాభా సంఖ్యను కిందికి లాగేంతబలమైనది కాదు. కారణం అటువంటి 'తక్కువ సంతానం' ఇష్టపడేవాళ్లు.... ముఖ్యంగా అవలంబించి చూపే వాళ్లు చాలా తక్కువ. పిల్లల్ని పోషించే ఆర్థిక వెసులుబాటు లేకపోయినా కూడా మూర్ఖంగా పిల్లల్ని 'దేవుడిచ్చిన వరం'లా భావించి మురిసిపోయే వాళ్లే ఎక్కువ. ఎంతకాలం ఇటువంటి సంతాన మూలికలు వర్ధిల్లుతూ వుంటారో, అంతకాలం మనదేశంలో జనాభా తగ్గే అవకాశమే లేదు. చైనా వంటి దేశమే దాదాపు మూడు దశాబ్దాలుగా 'ఏక శిశువు' పాలసీని అమలుపరుస్తోంది. ఆ కారణంగా ఒకప్పుడు 3-4గా వున్న సంతాన రేటు 1.8కి పడిపోయింది. ఏతావాతా పట్టణాల్లో దంపతులకి ఒకే సంతానం ఉండాలన్న నిబంధన (అందులో చాలా వెసులుబాట్లు ఉన్నప్పటికీ) సత్ఫలితాలే ఇచ్చింది. మరో సగం దశాబ్దం వరకూ ఇదే నిబంధన కొనసాగించాలని చైనా నిర్ణయించింది.

మన దేశంలోనూ కుటుంబ నియంత్రణ నిబంధనలు, అవగాహన కొంతమేర పనిచేశాయనే

మన దేశంలో జనగణన

ప్రపంచంలోనే రెండవ అతి ఎక్కువ జనాభా గల దేశంగా పేరొందిన మన దేశంలో ఈ సంవత్సరం ఏప్రిల్ మూడున ఒక భారీ కార్యక్రమం ప్రారంభమయింది. సుమారు నూట ఇరవై కోట్లకు పైగా ఉన్న జనగణన మన రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ తొలి నమోదుతో దేశ వ్యాప్తంగా పదిహేనవ జనగణన మొదలయింది. మన దేశంలో ప్రతి పదేళ్లకొక సారి జనగణన జరుగుతుంది. ఏప్రిల్, జులై మధ్యలో మొదటి దశ పూర్తవుతుంది. ఈ దశలో ఇంటింటికీ తిరిగి సభ్యుల నమోదు జరుగుతుంది. తర్వాత వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మరోసారి జాబితా సరిచూడడం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే ఈ గణన 640 జిల్లాల్లో, 7742 పట్టణాల్లో, ఆరు లక్షలకు పైగా గ్రామాల్లో, ఇరవై నాలుగు కోట్లకు పైగా ఇళ్లలో వుంటుంది. ఈ కార్యక్రమం నిర్వహించడానికి రెండున్నర లక్షల మంది సిబ్బంది నడుం బిగించారు. ఈ బృహత్కార్యానికి అయ్యే ఖర్చు దాదాపు రెండువేల రెండు వందల తొమ్మిది కోట్ల రూపాయలు. జనాభా లెక్కలు తీసుకున్న తర్వాత జనుల ఫొటోలు, వేలిముద్రలు కూడా సేకరిస్తారు. ఆ తర్వాత ప్రతి పౌరునికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఇప్పటికే చూచాయగా నూట ఇరవై కోట్లకు పైగా వున్న భారతీయ జనాభా, మరో ఇరవై ఏళ్లలో చైనా జనాభా (ప్రస్తుతం అక్కడ జనాభా నూట ముప్పై మూడు కోట్లు)ను దాటే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ సమయానికి మన జనాభా నూట యాభైమూడు కోట్లకు చేరవచ్చనీ, కానీ అప్పటికి చైనా జనాభా మాత్రం నూట నలభై ఆరు కోట్ల నుండి తగ్గవచ్చనీ నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం మనం ఈ భూగోళంపై మానవులలో పదిహేడు శాతం వున్నాం. గత ఏడాది లెక్కల ప్రకారం ప్రపంచ జనాభా ఆరువందల ఎనభై కోట్లు. మనకు స్వతంత్రం వచ్చినప్పుడు మనం కేవలం ముప్పై అయిదు కోట్లమందిమే. ఇప్పటికి మూడింతలకు పైగా పెరిగాం. ఈ అపూర్వ కార్యక్రమం సక్రమంగా జరగడమే ఒక విశేషం. సదరు గణన తర్వాత రాబోయే వివరాలు ఇంకా ఎంత విశేషంగా వుంటాయో వేచి చూడాలి.





ఇది తెల్సా?

తొలి జనగణన ఈజిప్టులో 3340 బిసి, 3050 బిసి లలో జరిగింది. చైనాలో సుమారు నాలుగు వేల ఏళ్ల క్రితం ప్రారంభం కాగా, మన దేశంలో 1889లో మొదలైంది. అప్పటినుండి ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతోంది. ప్రస్తుతం జరిగేది 15వ సెన్సస్.

చెప్పాలి. ఒకప్పుడు (1966)5.7గా వున్న సంతాన రేటు 2009 కల్లా 2.7కి పడిపోయింది. అయినప్పటికీ స్థూలంగా జాతీయ స్థాయిలో మాత్రం పెద్దగా సత్ఫలితాలు కనిపించలేదు. అందుకు కారణాలు అనేకం. అవగాహనా లేమి ఒకటైతే, నేనే ఎందుకు పాటించాలి అనే దృక్పథం మరొకటి. మతపరమైన మూర్ఖత్వం ఒకటైతే, సామాజిక ఒత్తిడులు (మగ సంతానం కలిగే వరకూ కనడం) మరొకటి. ఇక అవగాహన ఉన్నవాళ్లు కూడా సంతాన నిరోధన పద్ధతులు సరిగా పాటించకో, పొరపాటునో, ఏమరుపాటునో.... తక్కువ సంతానం కంటే ఎక్కువ కంటున్నారు. ఇటీవల ఎయిడ్స్ వంటి వ్యాధుల భయం వల్ల సంతాన వృద్ధి కొద్దిగా తగ్గింది (నియంత్రణ పద్ధతుల మూలంగానూ కావచ్చు) అంటున్నారు.

అధిక జనాభా ఏ రకంగానూ అభిలషణీయం కాదు. ఆ కారణంగా జీవన స్థాయి గణనీయంగా దిగజారి పోవడం ప్రత్యక్ష సాక్ష్యమే. ఐక్యరాజ్యసమితి వారి మానవ అభివృద్ధి సూచిక (2007) ప్రకారం మన దేశం 126వ స్థానంలో వుంది. ఆ సూచిక ఒక దేశపు సామాజిక, ఆరోగ్య, విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఎక్కువ సభ్యుల వల్ల ఒక కుటుంబం ఎంత ఇబ్బంది పడుతుందో, అధిక జనాభా వల్ల ఒక దేశం కూడా సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. పరిమితంగా వున్న వనరులను పెరుగుతున్న ప్రజానీయం పంచుకోవడానికి పోటీ పెంచుతూ పోతే, ఆ మాత్రం వనరులు కూడా ఏ ఒక్కరికీ సక్రమంగా అనుభవించే అవకాశం వుండదని ఇప్పటికే ఎన్నో విధాలుగా వ్యక్తమయింది. నేలా, గాలీ, నీరూ అన్నీ కేవలం జనులు పెరగడం వల్లనే కలుషితమయ్యాయంటే అతిశయోక్తికాదు. వైద్య రంగ అభివృద్ధి ద్వారా శిశు మరణాలు తగ్గించి, జీవిత కాలాన్ని పెంచింది మానవుడే. చంద్రునిపై, వీలుంటే అంగారక గ్రహంపై గుడారాలు వేసి మానవులను నివసింప చేద్దామనుకోవడం శాస్త్ర రంగంలో అపూర్వ అభివృద్ధే కావచ్చు. అది మానవ మేథకు మహా నీరాజనమే అవ్వొచ్చు. కానీ ఏ కారణం వల్ల వున్న నివాసం వదిలి అంతరిక్షానికి బదిలీ అవ్వవలసి వస్తుంది? గ్రహ రాశుల మూలాలనూ, కడలి గర్భాల జాడలనూ జల్లెడ పట్టగల మానవ మేథ తన జాతి సంఖ్య అవాంఛనీయంగా పెరుగుతుంటే చేష్టలుడిగి చూస్తూ ఉండవలసిన అగత్యమేంటి?ఎందువల్ల జనాభా నియంత్రణ పటిష్టంగా జరగడం లేదు? ఎందుకింత జాప్యం? ఎందుకింత అలసత్వం? ఒక పక్క ప్రపంచ దేశాలు తక్కువ జనాభాతో సిరిసంపదలతో తులతూగుతుంటే, మనమూ, మనవంటి మరో ఒకటి రెండు దేశాలు మాత్రం జనాభానే సిరిగా ఎంచుతున్నామనే సంకేతాన్ని ఎందుకు పంపుతున్నాం? ఇరవై ఒకటవ శతాబ్దాంతానికి రెండువందల కోట్లకు పైగా జనాభాతో మనమే ముందుండబోతున్నామని అంచనాలు. అటువంటి గొప్ప మనకు అవసరమా? అప్పటికి అమెరికా జనాభా వందకోట్లకు కూడా చేరదట!

ఈ సమస్యకు పరిష్కారం పాలకుల వద్ద, మన వద్ద వుంది. సంతానం సౌభాగ్యమే కావచ్చు. కాలానుగుణంగా వ్యవహరించి తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, ఆ సౌభాగ్యామే మన దౌర్భాగ్యానికి కారణమౌతుంది. వాస్తవిక పరిస్థితులను బట్టి కుటుంబాన్ని నియంత్రించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరికీ వుంది. ఒకవేళ నిజంగానే గంపెడు సంతానాన్ని పెంచి పోషించగల సత్తా వున్నా కూడా, తక్కువ మందితో సంతృప్తి చెందడం వల్ల భవిష్యత్తులో వారి కారణంగా జనాభా మరింత పెరగదన్న ధీమా ఉంటుంది. ఒక్కో సంతానం రాబోయే కాలంలో జనాభాని ద్విగుణం బహుళం చేయగల శక్తి. అది గుర్తించవలసింది మనమే.

★

ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రపంచ జనాభా రోజు 1989 జులై పదకొండవ తేదీ నుండి, ప్రతి సంవత్సరం అదే రోజును ప్రపంచ జనాభా రోజుగా పాటిస్తున్నారు. ఐక్యరాజ్య అభివృద్ధి కార్యక్రమం తాలూకు నియంత్రణ మండలి ఈ రోజు జరపాలని 1989లో నిర్ణయించింది. ఆ సంవత్సరం జులై పదకొండున ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు (ఐదు వందల కోట్లు) చేరింది. సరిగ్గా ఇరవై ఏళ్లకి జనాభా ఆరు వందల డెబ్బై మూడు కోట్లకు పెరిగింది. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా జనాభా సమస్యలపై అవగాహన కలిగించడం ప్రధాన ఉద్దేశం. ప్రపంచంలో ప్రతి మనిషి నమోదు కావడం అతి ముఖ్యం. ఆ లెక్కల ప్రకారమే ప్రణాళికలు రూపొందుతాయి. ఈ ఏడాది ప్రపంచ జనాభా రోజు ముఖ్య అంశం అదే. అభివృద్ధికి అవసరమైన వివరాల ప్రాముఖ్యత. జనగణనలో వచ్చిన వివరాలు కచ్చితంగా ఉండడం కూడా ముఖ్యమే. అలా వచ్చిన వివరాలు కొన్ని కీలకమైన సరళులు చూపుతాయి. ఒక్కో దేశ సవివర చిత్రాన్ని బయలుపరుస్తాయి. ఏ ప్రాంత ప్రజలు ఎలా వున్నారో, ఏ సాంఘిక స్థాయిలు ఎంత అభివృద్ధి చెందాయో, ఏ జాతులు ఏ మేరకు ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నారో, ఎటువంటి ప్రాంతాల్లో ఎటువంటి జీవన శైలి ఉందో, కనీస సౌకర్యాల నుండి ఆధునిక వెసులుబాట్లు ఏ వర్గాలకి అమరాయో, నిజంగా విద్య ఎంతమందికి అందుతుందో, ఎంతమంది విద్యాధికులో, ఎంతమంది నిరుద్యోగులో వంటి సవివర జాబితా చేతికందుతుంది. జనగణన అంటే కేవలం ప్రజల సంఖ్య మాత్రమే కాదు మరి.



క్రైమ్ కథ

వేటగాడు

"నెలరోజులుగా మీదగదిలో దిగిన కుర్రాడు పగలంతా పడుకుంటాడు. రాత్రిళ్ల లైట్లు వేసుకుని లాప్‌టాప్‌లో ఉంటాడు. ఏం చేస్తుంటాడు. అతడెవరు?ఏమిటా కథ?" నైట్‌డ్యూటీకి వెడుతూ అడిగాడు జోసఫ్.

నాకేం తెలుస్తుంది అన్నట్టుగానే చూసింది భార్య. కూతురు మేరీ మాత్రం సన్నగా నవ్వేసి "అద్దె నాకే తెచ్చి ఇచ్చాడు డాడీ. అతడు నెట్‌లో పని చేస్తుంటాడు. ఏవో వెబ్‌సైట్సుకు రాస్తుంటాడట. నాకు తాను రైటర్, కాలమిస్టు, ఫ్రీలాన్సు అని వగైరాలు చెబుతుంటాడు. లాప్‌టాప్‌లో ఉంటాడు. నేను అర్ధరాత్రి వరకు చదువుతాను. అప్పుడు అతడు ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి చేరతాడు. అక్కణ్నించి ఉదయం వరకు లాప్‌టాప్‌లో ఉంటాడు. ఇతర విషయాల్లో ఉండడు. ఏం తింటాడో ఏం తినడో తెలియదు. గది నిండా వాటర్ బాటిల్సు ఉంటాయి"

"కుర్రాడు ఎవరి జోలికి పోడు. సరే, నేను నైట్ డ్యూటీకి వెళ్తున్నాను. జాగ్రత్త. ముక్కు ముఖం తెలియనివారికి రూమ్ ఇచ్చి పొరపాటు చేశాననిపిస్తోంది. ఒకవేళ అర్ధరాత్రివేళ తలుపుతడితే తీయొద్దు" చెప్పి వెళ్లిపోయాడు జోసఫ్.

మేరీ అర్ధరాత్రి వరకు తన గదిలో చదువుకుని కిటికీలోంచి గోడవైపు చూసింది. మీదగదిలో లైటు వెలిగినట్టు నీడ పడింది. నవ్వుకుని భూపాల్ వ్యక్తిత్వం చిత్రంగానే ఉంది. అందగాడు, మాట్లాడేందుకు ప్రయత్నించినా మాట్లాడడు. కనీసం చూడనైనా చూడడు. కింద ఓ కుటుంబం వుంది. వారికో అమ్మాయి ఉంది అని కూడా కళ్లు తిప్పడు. మెట్లు ఎక్కుతున్నపుడు దిగుతున్నప్పుడు మెట్లు చూసుకుంటూ వెడతాడు. పెక్యులర్ క్యారెక్టర్ అనుకుని నిద్రపోయింది.

ఒక్కసారి కాలింగ్‌బెల్ మోగింది. మేరీకి తెలివివచ్చింది. పక్కనే నిద్రపోతున్న తల్లి లేచింది. ఎవరు అని తలుపు వద్దకు వెళ్లి అడిగారు. "మాడమ్ నన్ను రక్షించండి" అని భూపాల్ గొంతు విన్పించింది.

ఇద్దరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని 'ఏమయ్యింది బాబు?' అంది

"నాకు కడుపునొప్పి తీవ్రంగా ఉంది. భరించలేకున్నాను ప్లీజ్ హెల్ప్‌మీ!" బాధను వ్యక్తంచేసాడు. ఇప్పుడే జోసఫ్ చెప్పివెళ్లాడు. మీదున్న భూపాల్ తలుపు తడితే తీయొద్దని ఆయన చెప్పినట్టే ఈరాత్రి రావడంపై ఎందుకో తల్లీకూతురు భయపడ్డారు.

"అమ్మా నన్ను నమ్మండి. కిటికీ తెరిచి నన్ను చూడండి. ఈకాలనీలో మీ స్నేహితులను ఫోన్‌లో పిలవండి" ప్రాధేయ పడ్డాడు.

మేరీ తలుపు తీయకుండానే సెల్ అందుకుని ఆ కాలనీలో ఉన్న కేర్ ఆసుపత్రికి రింగ్‌చేసి విషయం చెప్పింది. వెంటనే వ్యాన్ వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది భూపాల్‌ను వ్యాన్ ఎక్కించుకుని పోయారు. రాత్రి తల్లీకూతుళ్లకు నిద్రపట్టలేదు. విలవిలలాడిపోతున్న భూపాల్‌ను కిటికీలోంచి చూసికూడా రక్షించలేకపోయామని బాధపడ్డారు. ఉదయం వరకు మగతమీద నిద్రపోయి ఐదింటికి లేచారు.

మేరీ ఆసుపత్రికి వెళ్లింది. అతడికి కిడ్నీ ప్రాబ్లెమ్ ఉంది. నొప్పితో బాధ పడుతున్నాడు. స్టోన్ ఫార్మయ్యింది. మందులతో నయం అవుతుంది. అయితే రెండురోజులు ఇక్కడే రెస్టులో ఉంటే సరిపోతుంది అని చెప్పారు.

భూపాల్ మేరీని చూడగానే పడుకున్నవాడు లేచి కూర్చున్నాడు.

"నా ప్రాణాలు రక్షించారు. నాప్రాణం ఎంతో విలువైనది. నేను వందేళ్లు బతికేందుకు ఆశపడడంలేదు. కొద్దినెలలు బతికితే చాలు. నేను కొన్ని పనులు చేయాల్సిఉంది. అది లోకానికి పనికివచ్చేది కాదు. అక్షరాలా నాకు మాత్రమే పనికివచ్చేది" మగతమీద చెబుతుంటే మేరీకి ఒక్క ముక్క అర్ధంకాలేదు.

"నారూమ్‌లో డ్రాయర్ సొరుగులో డబ్బు తెచ్చి చెల్లించండి. వీళ్లు డబ్బు ఎవరు కడతారు అని పదేపదే అడుగుతున్నారు. నాకు ఈరెండో హెల్ప్ చేయండి" చేతులు మోడ్చి కోరాడు.

"భలే వారే. తప్పకుండా మీ పనులన్నీ చేసిపెడతాను. మీకు తినడానికి తీసుకువస్తాను" అని చెప్పి వెనుదిరిగింది.

అతడి రూమ్‌కి వెళ్లింది. బార్లా తెరిచి ఉంది. డ్రాయర్ సొరుగులో పదివేలుంది. పక్కనే ఏటిఎమ్ కార్డు, ఒక డైరీ ఉన్నాయి. అందులో ఎల్ ఫర్ లవ్, ఎమ్ ఫర్ మర్డర్ అని పదేపదే రాసుంది. కొన్నిచోట్ల రజనీ ఐలవ్‌యూ అని కూడా రాసుంది. మేరీకి అవి చూసాక మనస్సులో గందరగోళం ఆవహించింది. హాస్పిటల్ బెడ్‌మీద అతడి మాటలు గుర్తుకువచ్చాయి. కొన్నాళ్లు బతికితే చాలు అనేమాటకు అర్థం కొద్దిగా తెలిసింది. లాప్‌టాప్ ఓపెన్ చేసింది. గూగుల్ మెయిల్ హిస్టరీలో చాలా లోడ్ అయి ఉన్నాయి. అందులో అతడి మెయిల్‌లో చాటింగ్సును ఓపెన్ చేసింది.

మేరీకి భయం వేసింది భూపాల్ కొందరు మిత్రులతో చాట్ చేసినదంతా రజనీ అనే ఒకమ్మాయిని చంపేందుకు కుట్ర. ఆఅమ్మాయి కేరళలో దాగుంది. భూపాల్ చేతిలో అప్పటికే రజనీ తండ్రి హతుడయ్యాడు. పోలీసులు ఇతనికోసం వెతుకుతున్నారు. పోలీసులకు చిక్కేలోపే ఈ కుట్రలో భాగంగా రజనీని చంపేందుకు బెంగుళూర్ శివార్లలో తల దాచుకున్నాడన్నమాట అని మేరీ తెలుసుకున్న మరుక్షణం మరింత లోతుగా విషయాలు తెలుసుకుని నోట్ చేసింది.

అదే లాప్‌టాప్‌లో ముంబాయ్ నార్తు పోలీసు కార్యాలయంలో క్రయిమ్సు ఓపెన్ చేసింది. అందులో ముఖుల్‌శర్మ మర్డర్ హంతకుడు భూపాల్ పరార్. ప్రాణభయంతో రజని. అజ్ఞాతంలోకి తీసుకుపోయిన బంధువులు. ప్రేమించమంటూ వేధించి చివరికి అడుగడుగున అడ్డుపడుతున్న రజనీతండ్రిని చంపి పరార్ అయిన భూపాల్. విషయం తెలుసుకున్నాక మేరీ నిలువెల్లా కంపించింది. రజనీ ఎక్కడుందో తెలిసిపోయింది. ఆమె చిరునామా ఆమె బంధువు ద్వారా తెలుసుకున్నట్టు చాట్‌లో ఉంది. మరి రెండు రోజుల్లో భూపాల్ చేతుల్లో ఆమె చంపబడుతుంది. ఈలోగా భూపాల్‌కు కడుపునొప్పి వచ్చింది. లేకుంటే......

ఒక హంతకుడి కొంపలో తాను ఒంటరిగా ఉన్నందుకు ఆమె పెదాలు, నాలుక తడారాయి. భయాన్ని తరిమేసి లేచి ఆగదిలోంచి వెలికి వచ్చింది అప్పటికే మెట్లమీద తండ్రి వస్తూ కన్పించాడు. కూతురు ముఖం నిండా చెమటలు చూసి 'ఏమయ్యింది? ఎందుకలా ఉన్నావు?' అని ప్రశ్నిం చాడు.

"డాడీ ఆటో పిలవండి" కీచుగా అరిచింది.

ఎందుకు అని కూడా అడగకుండా అనుమానంగా చూస్తునే రోడ్డుమీద పోతున్న ఖాళీ ఆటో ఆపించి ఎక్కేశారు తండ్రీకూతురు.

"పోలీసుస్టేషన్‌కు పోనివ్వు" రజనీ గొంతు మరింత పూడుకుపోయింది. జోసఫ్ భయంగా చూశాడు.

పోలీస్‌స్టేషన్‌లో రజని మొత్తం వివరించింది. పోలీసులు క్షణాల్లో ఎలర్టు అయ్యారు. ఆసుపత్రిలో మగతలో నిద్రపోతున్న భూపాల్‌ను అరెస్టుచేసారు. ముంబాయ్ పోలీసులకు సమాచారం అందించారు. భూపాల్‌తో బాటు అతడి ఫ్రెండ్సు నలుగురుని చాటింగ్‌ల ఆధారంతో అరెస్టు చేసి కోర్టుబోనులో నిలిపారు.

"మేరీ! నన్ను కాదనుకున్న రజనీని వదిలించుకున్నాక నిన్నే ప్రేమించాలనుకున్నాను. కానీ ఈలోగా నువ్వే నన్ను పోలీసులకు పట్టించావు" అని భూపాల్ అరెస్టు అయినప్పుడు తనతో చెప్పిన మాటలను తలచుకుని మేరీ గట్టిగా తల విదిలించుకుని మైగాడ్ ఎంతప్రమాదం తప్పింది. అని గాఢంగా నిట్టూర్చింది.

- యర్నాగుల సుధాకరరావు

పుట్టగొడుగుల పలావు

కావలసిన పదార్థాలు

వండిన బాస్మతి అన్నం - 3 కప్పులు,
బటన్ మష్రూమ్ - 200గ్రా, మధ్య రకం ఉల్లిపాయలు - 2
బిరింజాకులు - 2, దాల్చిన చెక్క - అంగుళం ముక్క
ఎండుమిర్చి - 3, నెయ్యి - 3 టేబుల్‌స్పూన్లు

తయారుచేసే పద్ధతి

అన్నం వండేటప్పుడే ఉప్పు కలపండి. పుట్టగొడుగుల్ని, ఉల్లిపాయల్ని గుండ్రటి ముక్కలుగా కోసుకోండి. నెయ్యి వేడి చేసి మసాలాలన్నీ వేయండి. వేగాక పుట్టగొడుగులు, ఉల్లి ముక్కలు బంగారు రంగు వచ్చేంతవరకు వేయించి బోర్లించిన బాస్మతి అన్నంపైన గుండ్రంగా అలంకరించండి.

పాల్ వంకాయ సూప్



కావలసిన పదార్థాలు

వంకాయలు - 2
పాలు - 1 కప్పు
ఉల్లిపాయ - 1
వెన్న - 1 టేబుల్ స్పూన్
వరిపిండి - 1 టేబుల్ స్పూన్
ఉప్పు - తగినంత
నెయ్యి - 1 టీ స్పూన్

తయారు చేసే పద్ధతి

వంకాయకు నూనెగాని, నెయ్యిగాని రాసి సెగమీద తిప్పుతూ ఉడకబెట్టాలి. పైన తొక్కు తీసి ఉడికిన వంకాయలను మెత్తగా పిసకాలి. ఉల్లిపాయ ముక్కలను నేతిలో వేయించాలి.

పాలు విడిగా మరగబెట్టాలి. వంకాయ గుజ్జు, ఉప్పు, వెన్న వరిపిండి, ఉల్లిపాయ ముక్కలు అన్నీ కలిపి ఉడికించాలి. ఉడుకుతుండగా కావలసిన పరిమాణంలో నీళ్లు కలిపి పాలు పొయ్యాలి. ఉప్పు చివరిలో వేస్తే పాలు విరగవు.

కె. పద్మిని, కోడూరు.

శనగపిండి కూర

కావలసిన పదార్థాలు

శనగపిండి - పావుకిలో, ఉల్లిపాయలు - 3
పచ్చిమిర్చి - 2, ఎండుమిర్చి - 2
కారం - 1 స్పూన్, ఉప్పు - తగినంత
నూనె - 4 స్పూన్లు, తాలింపుగింజలు - 2 స్పూన్లు
కరివేపాకు - 2 రెమ్మలు

తయారుచేసే పద్ధతి

మొదట ఉల్లిపాయలు, పచ్చిమిర్చి సన్నముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టౌమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది కాగాక తాలింపు గింజలు వేసి అవి చిటపట లాడిన తర్వాత తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి సన్నని సెగ మీద వేయించుకోవాలి. శనగపిండిలో కారం, ఉప్పు వేసి తగినన్ని నీళ్లు పోసి జారుడుగా కలపాలి. దీన్ని బాండీలో వేయించుకున్న తాలింపులో వేయాలి. సన్నని సెగ మీద పిండి ఉండలు కట్టకుండా కలుపుతూ రెండు నిమిషాల తర్వాత స్టౌ కట్టేయాలి. దీనిని భోజనంలో కానీ, టిఫిన్‌లో కానీ వేసుకోవచ్చు. చాలా కమ్మగా, రుచిగా వుంటుంది.

టి.వి.డి.ఎస్ సీతారామారావు, విజయవాడ.

మెంతి మష్రూమ్

కావలసిన పదార్థాలు

తాజా మెంతి ఆకు - 300 గ్రా
బటన్ మష్రూమ్ - 200గ్రా
నూనె - 4 టేబుల్ స్పూన్లు
టొమాటోలు - 3
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్
కొత్తిమీర - కొద్దిగా
పసుపు - కొద్దిగా
పచ్చిమిరపకాయలు - 2

తయారుచేసే పద్ధతి

మష్రూమ్‌లను శుభ్రంగా కడిగి కోసి ఒక పక్కన పెట్టుకోవాలి. మెంతి ఆకులను గిల్లి కడిగాక సన్నగా తరిగి పెట్టుకోవాలి. సగం నూనె తీసుకుని అందులో మెంతి ఆకులను వేసి రెండు నిమిషాలు ఉంచాలి. తరిగిన టొమాటోలు వేసి రెండు నిమిషాల తర్వాత మిగిలిన పదార్థాలన్నింటిని వేసి మూత పెట్టాలి. సన్నటి సెగపై వుంచే అప్పుడప్పుడు కలియబెడుతూ వుండాలి. అలా ఐదారు నిమిషాలు వుంచిన తర్వాత దించి వేడివేడిగా పరోటాలతో తింటే బాగుంటుంది.

ఎం. పావని, విశాఖ.



మూద్దామా



1815 అడుగుల సన్నని టవర్, అందులో ప్రతి గంటా 12 నిమిషాలకు ఒకసారి గుండ్రంగా తిరిగే రెస్టారెంట్, వేల సంవత్సరాల నాటి చరిత్ర, అపురూపమైన జంతుజాలాన్ని మన కళ్ల ముందుంచే మ్యూజియం, ఒకనాడు శాస్త్రవేత్తలను ప్రయోగాలు చేసేందుకు అనుమతించిన సైన్స్ మ్యూజియం, చల్లని సముద్రతీరం, వింత వింత ఆకారాల్లో ఆశ్చర్యంగొలిపే కొండలు, వివిధ సంస్కృతులను పరిచయం చేసే ప్రదేశాలు... కెనడా వెళ్లిన ప్రతి ఒక్కరినీ ఎంతగానో అలరిస్తాయి. ఆ విశేషాల గురించి ఈ వారం చూద్దామాలో...

సిఎన్ టవర్

కళ్లింపడేసే కెనడా విశేషాలు

ప్రపంచంలోకల్లా (వైశాల్యపరంగా) రెండవ అతిపెద్ద దేశం కెనడా. ఉత్తర అమెరికాలో అతి పెద్ద దేశం. ఇక్కడ ఎండాకాలంలో ఉష్ణోగ్రత ఎక్కువగానే అంటే 40 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. అమెరికా, పశ్చిమ యూరప్‌లతో పోలిస్తే కెనడాలో వాతావరణం చల్లగానే ఉంటుంది. అక్టోబర్ నుండి మే మధ్యలో ఎప్పుడు కెనడాకు వెళ్లినా స్వెటర్లు, కోట్లు వెంట తీసుకుపోవడమే మంచిది. కెనడాలో ఎంతో సుందరంగా ఉండే ద్వీప రాష్ట్రం నోవాస్కోషియా. కొండలు, సముద్రాలతో రమణీయంగా తోచే చిన్న రాష్ట్రమిది. దీని రాజధాని హెలిఫాక్స్. ఇది కెనడాకు తూర్పున ఉంది. అట్లాంటిక్ మహా సముద్రం మధ్యలో ఉన్న ఈ రాష్ట్రం, అందులోని ఈ పట్టణం పర్యాటకులను ఎంతగానో అలరిస్తాయి. దీనికి 200 కిలోమీటర్ల దూరంలో సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ విశ్వవిద్యాలయం ఉంది.

నేషనల్ పార్కు

నోవాస్కోషియా రాష్ట్రంలో 'కేప్ బ్రిటన్ హైలాండ్స్'ని 1936లో కెనడా ప్రభుత్వం నేషనల్ పార్కుగా ప్రకటించింది. ఈ రాష్ట్రంలోని అతి పెద్ద పార్కు ఇది. దీని వైశాల్యం 950 చ.కి.మీ. పచ్చని చెట్లు, రుతువులకనుగుణంగా మారే వాతావరణం... ఆ పార్కులోకి అడుగుపెట్టగానే ఓ అద్భుతలోకంలోకి వెళ్లినట్లనిపిస్తుంది. మరో పక్క సముద్రం, పక్కనే కొండలు, వాటి వింతవింత ఆకారాలు సందర్శకులకు కొత్త అనుభూతులను కలిగిస్తాయి. దూరంగా సముద్రమే ఆకాశాన్ని అందుకోవడానికి ప్రయత్నిస్తుందా లేక ఆకాశమే సముద్ర అందచందాలను తిలకించడానికి కిందికి వంగిందా అని ఆశ్చర్యాన్ని కలిగించే ఆ దృశ్యం మంత్రముగ్ధులను చేస్తుంది. మరోపక్క ఎత్తైన రాళ్ల పైనుంచి నెమ్మదిగా జాలువారుతున్న నీరు, అక్కడి చల్లదనానికి అది ఘనీభవించి ఏర్పడిన వివిధ ఆకృతులు, వాటిపై సూర్యకిరణాలు పడినప్పుడు వివిధ కాంతులను వెదజల్లే ఆ దృశ్యాలు... నిజంగా మరపురానివి. జింకల కుటుంబానికి చెందిన భారీ సైజులో ముదురు గోధుమ రంగులో ఉండే జంతువును అక్కడ మూస్ అంటారు. కెనడియన్లు దాని మంసాన్ని తింటారు.

పార్కులో అక్కడక్కడా వ్యూపాయింట్స్ ఉంటాయి. వాటి మీది నుంచి అక్కడి వింత వింత ప్రకృతి దృశ్యాలను తిలకించొచ్చు. సీజన్‌లో అయితే అక్కడ రెస్టారెంట్లు, బోటు షికార్లు ఉంటాయి. పచ్చగా మెరిసిపోయే లాన్, ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటకులు కూర్చుని ఆ దృశ్యాలను తిలకించి కాసేపు కబుర్లు చెప్పుకునేందుకు వీలుగా బెంచీలు ఉంటాయి.

ఓంటారియోలో కాసాలోమా

టొరంటోను చూస్తే ఓ మినీ ప్రపంచాన్ని చూసినట్టుంటుందంటారు. ఓంటారియోలో కాసాలోమా కెనడాలోని పర్యాటక ప్రదేశాల్లో ఒకటి. 'కాసాలోమా' అంటే 'కొండపై ఉన్న ఇల్లు' అని అర్థం. ఇది ఆ దేశంలోని అతిపెద్ద భవనం. మూడంతస్తులుండే ఈ కోటలో 98 గదులున్నాయి. మ్యూజియం, స్విమ్మింగ్‌పూల్, లైబ్రరీ లాంటి అన్ని సౌకర్యాలూ ఇక్కడ ఉన్నాయి. దీనిలో ఒకప్పుడు సర్ హెన్రీ మిల్ అనే వ్యాపారవేత్త ఉండేవాడు. ఈ కోట లోపలా, బయటా ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉద్యానవనాలు ఎంతగానో ఆకర్షిస్తాయి. భూగర్భంలో ఉన్న గదులు, గ్రీన్‌హౌస్‌లు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. ఈ భవన నిర్మాణానికి సుమారు 300 మంది పనిచేశారట. దాదాపు 3 సంవత్సరాలపాటు దీని నిర్మాణం సాగింది. 1911లోనే దీని నిర్మాణానికి సుమారు 15 కోట్ల రూపాయలు ఖర్చయిందట.

సిఎన్ టవర్

కెనడా నేషనల్ టవర్‌ని సిఎన్ టవర్ అంటారు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద టవర్లలో ఒకటి. దీని ఎత్తు 1815 అడుగులు. ఈ టవర్‌ను 1976లో నిర్మించారు. అంత సన్నటి భవంతిని అంత ఎత్తులో నిర్మించిన తీరు





ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్



కాసాలోమా



ఒంటారియో సైన్స్ మ్యూజియం

ఆశ్చర్యపరుస్తుంది. ఈ టవర్ పైనుంచి చూస్తే పట్టణ సుందర దృశ్యాలన్నీ కనిపిస్తాయి. ఇక రాత్రిళ్లైతే రంగుల లైట్లతో ఓ సుందర లోకంలా కనిపిస్తుంది. కెనడియన్ నేషనల్ అనే రైల్వే విభాగం దీన్ని నిర్మించింది. అందుకే దానిపేరు మీదే ఈ టవర్‌కు నామకరణం చేశారు. ఆ తరువాత రైల్వేలకు నష్టాలు వాటిల్లడం వల్ల 'కెనడా ల్యాండ్స్ కంపెనీ' అనే ఒక ప్రయివేటు సంస్థకు దీన్ని అప్పజెప్పారు.

ఈ టవర్‌లో ఎన్నో టీవీ, రేడియో ఛానెళ్ల కార్యాలయాలున్నాయి. దీనిపై 335 అడుగుల ఎత్తు గల యాంటినా ఉంది. ఇది టీవీ, రేడియో సిగ్నళ్లను గ్రహించేందుకు ఏర్పాటు చేశారు. దీనిలో 1122 అడుగుల ఎత్తులో ఒక గ్లాస్‌ఫ్లోర్ ఉంటుంది. ఇక్కడ నిల్చుని చుట్టూ పట్టణాన్ని చూసేందుకు ఒక అబ్జర్వేషన్ డెక్‌ను కూడా ఏర్పాటు చేశారు. 1150 అడుగుల ఎత్తులో ఒక ప్రత్యేకమైన రెస్టారెంటు ఉంది. ఇది ప్రతి 72 నిమిషాలకూ ఒకసారి గుండ్రంగా తిరుగుతుంది. దీని నిర్మాణానికి ఇప్పటి లెక్కల్లో అయితే సుమారు 1300 కోట్ల రూపాయల ఖర్చవుతుందని అంచనా!

చారిత్రాత్మక డిస్టిలరీస్ డిస్ట్రిక్ట్

కెనడాలో చారిత్రాత్మక, పురాతన కట్టడాలకూ కొదవేం లేదు. డిస్టిలరీస్ డిస్ట్రిక్ట్ అనే ప్రాంతంలో మనం వాటినీ తిలకించొచ్చు. 13 ఎకరాల విస్తీర్ణం గల ఈ జిల్లాలోని పది వీధుల్లో 40 చారిత్రాత్మక భవంతులున్నాయి. ఇది టొరొంటో తూర్పు భాగంలో ఉంది. 1832ల ప్రాంతంలో ఇక్కడ విస్కీ ఎక్కువగా తయారయ్యేది. దాదాపు 60ల వరకూ ప్రపంచంలోనే అత్యధికంగా ఇక్కడ విస్కీ ఉత్పత్తి జరిగేది. తరువాత కాలక్రమంలో అది తగ్గిపోయింది. 'ఒలింపిక్ స్పిరిట్ టొరంటో' ఒలింపిక్స్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎంటర్‌టెయిన్‌మెంటు కాంప్లెక్స్. దీన్ని 2004లో ఏర్పాటు చేశారు. దీనిలో ఒలింపిక్స్‌లో మంచి ప్రతిభ సాధించిన వారి ఫొటోలు, ఆటవస్తువులు ఉంచుతారు. ప్రపంచంలో ఇటువంటిది ఇదొక్కటే.

రాయల్ ఒంటారియో మ్యూజియం

ఇక్కడ జీవపరిణామం, డైనోసార్లు వంటి అపురూపమైన జంతుజాలం చూడొచ్చు. ఇంకా ప్రపంచ చరిత్రలోని అనేక ఘట్టాలను ఒకేదగ్గర తిలకించొచ్చు. ఇది ఉత్తర అమెరికాలోని ఐదో అతిపెద్ద మ్యూజియం. ఇక్కడ 40 గ్యాలరీలలోని సుమారు 60 లక్షల వస్తువులు సందర్శకులను ఎంతగానో ఆలోచింపజేస్తాయి. ఇక్కడ తూర్పు ఆసియా, ఆఫ్రికాలలోని కళలు, ఐరోపా చరిత్ర, డైనోసార్లు మనం చూడొచ్చు.

టొరంటోలో ఒంటారియో సైన్స్ సెంటర్ అనే మ్యూజియం కూడా ఉంది. ఇక్కడ ప్రయోగాలు చూసేందుకు, చేసేందుకు శాస్త్రవేత్తలకు అవకాశం కల్పించేవారు. కానీ సందర్శకులు ప్రయోగాలు చేసేప్పుడు కొన్ని వస్తువులు పాడైపోవడం వల్ల ఇప్పుడు చూడ్డానికి మాత్రమే అనుమతిస్తున్నారు. ఇంకా అక్కడ సంగీతం పలికే ఫౌంటెయిన్లు, నీళ్ల పైపుకు చేయి అడ్డం పెడితే వింత వింత శబ్దాలు సందర్శకులను ఎంతగానో అలరిస్తాయి.

అతిపెద్ద వాణిజ్య కేంద్రం

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కెనడాలోని అతిపెద్ద వాణిజ్య కేంద్రం. దేశంలోని అతిపెద్ద బ్యాంకుల కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ఉత్తర అమెరికాలోని మూడో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ 'టీఎస్ఎక్స్' కూడా ఇక్కడే ఉంది. దక్షిణాసియా వంటకాలు, దుస్తులు దొరికే లిటిల్ ఇండియా, చైనావాసులుండే చైనా టౌన్, తినుబండారాలు, షాపింగ్‌కు సుప్రసిద్ధమైన అనెక్స్ వాణిజ్య సముదాయం యార్క్‌విల్లే, అనేక రకాల ఫ్యాషన్ దుస్తులు దొరికే డిస్ట్రిక్ట్ యాంగ్ స్ట్రీట్... అన్నీ ఇక్కడికొచ్చిన సందర్శకులను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఇందులో ఏది చూడకపోయినా మిస్సయ్యామనే ఫీలింగుంటుందట.

★



అట్టమీది కథ

ఛానళ్లు పెరిగితే ప్రేక్షకుల సంఖ్య అమాంతం పెరిగిపోదు. ఉన్న ప్రేక్షకుల్ని పంచుకునేందుకే అన్ని ఛానళ్లూ పోటీ పడుతుంటాయి. ఈక్రమంలో కొందరు కొత్త ప్రేక్షకులు కూడా పుట్టుకురావచ్చు. అయితే ఆపోటీలో బలంగా నిలిచేదెవరు, గెలిచేదెవరనే ప్రశ్న టీవీ చూసే ప్రతి ఒక్కరిలోనూ ఆసక్తి కలిగిస్తుంది. సగటు ప్రేక్షకుడికి కూడా ఏ ఛానల్‌కి ఆదరణ ఎక్కువ అనే విషయం తెలుసుకోవాలనే కోరిక ఉంటుంది. ఈ ఆదరణను బట్టే ర్యాంకింగ్స్ నిర్ణయించుకుంటారు. ఇక మార్కెట్ విస్తృతికి ఎవరికి తోచిన రీతిలో వారు కసరత్తు చేస్తుంటారు. వీటన్నిటికీ మూలాధారంగా వచ్చినవే రేటింగ్స్. శాస్త్రీయంగా జీఆర్పీ (గ్రాస్ రేటింగ్ పాయింట్స్) లేదా టీఆర్పీ (టార్గెట్ రేటింగ్ పాయింట్స్) అంటారు. సింపుల్‌గా ఇది ప్రేక్షకాదరణ కొలమానం(ఆడియన్స్ మెజర్‌మెంట్) అన్నమాట. టీవీఆర్ (టెలివిజన్ రేటింగ్స్)గా ఇది బాగా ప్రాచుర్యం పొందింది. రేటింగ్స్ అంటే ఒక నిర్దిష్ట సమయంలో, ఒక నిర్దిష్ట ప్రసారాన్ని చూసే ప్రేక్షకుల శాతం. ఇందులో వయో, లింగ వర్గీకరణ కూడా ఉంటుంది.

రేటింగ్ రేసు... తిరకాసు...

-కేశవ్

వస్తు ఉత్పత్తి తర్వాత, వినియోగదారుల అభిప్రాయమే కీలకం. ఆ స్పందనలకు అనుగుణంగా మార్కెట్ విస్తృతిపైన ఉత్పత్తి సంస్థలు దృష్టి పెడతాయి. టెలివిజన్ ప్రసారాలకు సంబంధించినంతవరకు అటువంటి ప్రయత్నమే రేటింగ్స్. పత్రికల్లో సులువుగా సర్వే పద్ధతి మీద ఆధారపడవచ్చు. పాఠకుల అభిప్రాయాలు, పంపిణీ వివరాలు సేకరించి ప్రతిస్పందనల్ని తెలుసుకోవచ్చు. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ ఆరు నెలలకొకసారి ఈ ప్రక్రియని నిర్వహిస్తుంది. కానీ టీవీల విషయంలో ఇది సాధ్యం కాదు. ప్రసారమయ్యే కార్యక్రమం, ప్రేక్షకునికి ప్రసారాలు అందుబాటులో ఉండే పరిస్థితి వంటి అంశాల్ని దృష్టిలో ఉంచుకొని రేటింగ్స్ నిర్ణయించాలి. ఇది ఎప్పటికప్పుడు జరిగే ప్రక్రియ. వ్యాపార లావాదేవీలు, ఇతరులతో సంబంధాలు, ఛానళ్లకు దిశానిర్దేశం, వాణిజ్య ప్రయోజనాల విషయంలో వీటిదే కీలక పాత్ర కావడంతో రేటింగ్స్ సేకరించే సంస్థలకు కూడా ప్రాధాన్యం పెరిగింది. మన దేశంలో ఈ రంగంలో రెండు సంస్థలు పనిచేసేవి. ఒకటి టామ్, రెండోది ఇన్‌టామ్. పదేళ్ల కిందట మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు ఈ రెండు సంస్థలూ పోటాపోటీగా పనిచేశాయి. వీటిని నడిపిస్తున్న సంస్థల మధ్య కుదిరిన ఒప్పందాల మేరకు రెండూ కలిసిపోయి, టామ్‌గా అవతరించాయి. అంతకుముందు ఇవి సేకరించిన రెండు రకాల శాంపిళ్లలో ఉన్న తేడాల వల్ల రేటింగ్స్‌లోనూ కొన్ని అంతరాలు కనిపించేవి. కొన్ని సందర్భాల్లో భారీ తేడాలు కూడా ఉండేవి. విలీనం తర్వాత భారతీయ టెలివిజన్ మార్కెట్‌లో టామ్ ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఇప్పుడు ఈ సంస్థ గీసిందే గీత. ప్రకటనకర్తలకూ, టెలివిజన్ యాజమాన్యాలకు, ఏజెన్సీలకు అదే ప్రామాణికం.



రేటింగ్స్ సేకరించే విధానం

టామ్ అంటే టెలివిజన్ ఆడియన్స్ మెజర్‌మెంట్. ఈ సంస్థ ఎప్పటికప్పుడు మీడియా అధ్యయనాల్ని నిర్వహిస్తూ ప్రేక్షకుల నాడిని అందించే ప్రయత్నం చేస్తుంది. ఇప్పుడొకసారి రేటింగ్స్ తీసే విధానాన్ని పరిశీలిద్దాం. రేటింగ్స్ సేకరించడానికి టామ్ సంస్థ "పీపుల్ మీటర్" అనే పరికరాన్ని ఉపయోగిస్తుంది. ఎంపిక చేసిన ఇళ్లలో వీటిని ఏర్పాటు చేసి, టీవీ రిమోట్‌తో అనుసంధానిస్తారు. ప్రేక్షకుల వర్గీకరణ కోసం దీనిపై ప్రత్యేకంగా మీటలు ఉంటాయి. అంటే స్త్రీలు, పురుషులు, పిల్లలు... ఇలా వయసుల్ని బట్టి వర్గీకరిస్తారు. సంబంధిత వర్గాలు టీవీ చూస్తున్నప్పుడు ఆయా బటన్లను నొక్కాలి. టీవీ దగ్గర నుంచి వెళ్లిపోయేటప్పుడు మళ్లీ ఆఫ్ చేసి వెళ్లాలి. ఈ ప్రక్రియ అంతా టామ్ ప్రధాన కార్యాలయంలో రికార్డు అవుతుంది. వారు చూసే ఛానళ్లు, చూస్తున్న సమయం కూడా నమోదవుతుంది. దీన్నిబట్టి రేటింగ్స్ నిర్ణయిస్తారు. రేటింగ్స్ వ్యవస్థకు కీలకమైన పీపుల్ మీటర్ల ఏర్పాటుకి టామ్ పదిహేనేళ్ల కిందట దేశంలో క్లాస్1 సిటీస్‌గా ఉన్న 29 నగరాల్ని ఎంపిక చేసింది. తర్వాత పెరిగిన అవసరాలకు అనుగుణంగా విస్తరిస్తూ పోయింది. ప్రస్తుతం

దేశం మొత్తంలో సుమారు పన్నెండు వేల పీపుల్ మీటర్లు పనిచేస్తున్నట్లు అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండు వందల వరకు పీపుల్ మీటర్లు పనిచేస్తున్నాయి. టెలివిజన్ ఛానళ్ల ఎంపిక, చూసే కార్యక్రమాలు, సమయ పరిమితులు, చూస్తున్న వర్గాలు వంటి అంశాల్ని ఈ మీటర్ల సాయంతో గుర్తిస్తారు. మన రాష్ట్రంలోని పట్టణాల్ని మూడు రకాలు విభజించారు. రాజధాని హైదరాబాద్‌కి ప్రత్యేక స్థానం ఉంది. రెండో విభాగంలో విశాఖ, విజయవాడ నగరాలు ఉన్నాయి. మరో పది పట్టణాల్లో కూడా పీపుల్ మీటర్లను అమర్చి రేటింగ్స్ పరిశీలనని జరుపుతున్నారు. ఈ మీటర్లు అమర్చడంలో వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాలు ఉన్న ఇళ్లనే ఎంపిక చేసుకోవడం విశేషం.

మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ఛానల్ వాటా (29.11.2009-5.12.2009)

ఛానల్	4+ అందరూ	4+ మహిళలు	4+ పురుషులు	15+ అందరూ	15+ మహిళలు	15+ పురుషులు
టీవీ9	5.07	4.37	5.91	5.32	4.57	6.24
ఈటీవీ2	1.95	1.72	2.23	2.06	1.76	2.43
ఎన్‌టీవీ	1.92	1.67	1.21	1.86	1.52	2.27
టీవీ5	2.15	1.95	2.38	2.47	2.25	2.74
జెమినీ న్యూస్	0.11	0.09	0.14	0.10	0.08	0.12
ఐ న్యూస్	0.73	0.60	0.38	0.80	0.62	1.01
హెచ్‌ఎంటీవీ	0.64	0.53	0.78	0.66	0.53	0.81
సాక్షి టీవీ	1.23	0.94	1.57	1.31	1.03	1.65
జీ 24 గంటలు	0.67	0.60	0.76	0.74	0.61	0.89
మహా టీవీ	0.25	0.19	0.32	0.27	0.21	0.33
స్టూడియో ఎన్	0.54	0.42	0.69	0.53	0.42	0.66
ఏబీఎన్	0.49	0.36	0.64	0.47	0.39	0.56
టీవీ1	0.26	0.24	0.29	0.30	0.28	0.33

ఆంధ్రప్రదేశ్‌లో ట్రెండ్

సాఫ్ట్‌వేర్ బూమ్, రియల్ ఎస్టేట్ బూమ్ గురించి వినీ, వినీ బోర్ కొట్టేసింది. ఇప్పుడు నడుస్తోంది మీడియా బూమ్. దేశంలోని ఇతర రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా, నేషనల్ మీడియా తర్వాత ఆ బూమ్‌ని ఆస్వాదిస్తోంది ఆంధ్రప్రదేశే. ఏడేళ్ళ కిందట న్యూస్ ఛానల్ పెట్టడం అంటే ప్రాంతీయ భాషల్లో సాధ్యమా? అనిపించింది. ఇప్పుడది ప్రాంతీయ భాషలకే సాధ్యమనిపిస్తోంది. జాతీయ మీడియా కూడా చొరబడలేని ప్రాంతాల్లోకి, పల్లెల్లోకి, సెక్షన్లలోకి ప్రాంతీయ మీడియా మాత్రమే ప్రవేశించి, ప్రభావం చూపగలుగుతోంది. తెలుగులో రెండు న్యూస్ ఛానళ్లు పుట్టిన తొలి నాళ్లలో మీడియా పరిశీలకులు జరిపిన అధ్యయనాలన్నీ ఇదే అంశాన్ని ధ్రువీకరించాయి. వినోద ఛానళ్ల ప్రియులుగా మారిన ప్రేక్షకుల్ని క్రమంగా న్యూస్‌ఛానళ్ల వైపు మళ్లించడంలో నిర్వాహకులు సఫలమయ్యారు. టామ్ జరిపిన పరిశీలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రేక్షకుడు న్యూస్ ఛానళ్లను చూసే సగటు, జాతీయ సగటు కంటే విపరీతంగా పెరిగింది. మార్కెట్ సామర్థ్యం విషయంలోనూ ఇతర రాష్ట్రాలకంటే భిన్నమైన అభిరుచులు ఇక్కడ ఉండటం ఛానళ్ల విస్తృతికి దోహదం చేసింది. ఇండియన్ టెలివిజన్ డాట్ కామ్ వంటి సంస్థలు కూడా ఈ అంశాన్ని శాస్త్రీయంగా నిరూపించాయి. 2009లో వచ్చిన ఎన్నికలు, కొత్త ఛానళ్ల వెల్లువ వల్ల పెరిగిన మోజు వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకున్నప్పటికీ టీవీ ప్రేక్షకుల సంఖ్య స్థిరంగా ఉండటం ఆసక్తిని కలిగించే అంశం. టామ్ ఇటీవల నిర్వహించిన డిజిటల్ ఎస్టాబ్లిష్‌మెంట్ సర్వేలో డీటీహెచ్ సేవలు కూడా వేగంగా విస్తరిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో మార్కెట్‌లో పోటీ మరింత వేగవంతం అయ్యింది. ఈ పోటీ విధానంలో రేటింగ్స్‌కి తప్ప మరే విషయానికీ ప్రాధాన్యం లేకుండా పోయింది. అందుకే రూపొందిన కార్యక్రమాలకు వచ్చిన రేటింగ్స్ తెలుసుకునే రోజులు ఇప్పుడు పోయాయి. రేటింగ్స్ కోసమే ప్రసారాల్ని రూపొందించాల్సిన పరిస్థితి దాపురించింది. ఛానళ్ల పోటీలో రేటింగ్‌ల వేట మొదలయ్యాక నైతిక నియమావళి మాట అలా ఉంచితే మీడియాలో విపరీత ధోరణులు పెరిగిపోయాయి. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక మీడియా దిశ మార్చుకుందంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సీనియర్ జర్నలిస్టు రామ్‌కరణ్ చేసిన వ్యాఖ్యలు ఒకసారి గుర్తు చేసుకోవాలి. "బడ్జెట్ స్టోరీలు రాసే బాధ్యతను బిజినెస్ జర్నలిస్టుల కంటే, సంస్థ ఎకౌంటెంట్లకు అప్పగించడంతోనే ఎడిటర్ల వ్యవస్థను కుప్పకూల్చే ప్రక్రియ ప్రారంభమైంది." ఛానళ్ల వెల్లువ ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో తెలుగు ఛానళ్ల తీరుపై సీఎంఎస్ నిర్వహించిన ఫోకస్ గ్రూప్ వర్క్‌షాప్‌లో సీనియర్ జర్నలిస్టు ఒకరు ఇలా వ్యాఖ్యానించారు. "మీ[illegible] అంటే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పనిచేసే సంస్థలు.. వారు కచ్చితంగా లాభాపేక్షతోనే పనిచేస్తారు. డబ్బు పెట్టేవారి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయక తప్పదు. వస్తున్న కార్యక్రమాలు ప్రజలకు నచ్చకపోతే చూడటం మానేయవచ్చు. అలానే మంచి కార్యక్రమాలు చేసినప్పుడూ చూస్తున్న పరిస్థితి లేదు. అందుకే మంచో చెడో అనవసరం. ప్రజల అవసరాలకు తగింది కాదు, ప్రజలకు నచ్చేదేంటో చూపిస్తాం... అప్పుడే రేటింగ్స్ వస్తాయి." ఈ మాటలు ఛానళ్ల పోకడకు అద్దం పడుతున్నాయి. జర్నలిస్టులు ఈ పరిస్థితిని నిలువరించలేరా. రేటింగ్స్ వెంపర్లాటలో అన్నీ వదిలేయాల్సిందేనా. పోటీ కాస్తా ఛానళ్ల మధ్య యుద్ధంగా మారుతున్న సందర్భాలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న సంస్కృతి, ప్రచారమే పరమావధిగా మారిపోతున్న ఎయిర్‌టైమ్, జర్నలిస్టులే కుట్రదారులుగా దొరికిపోతున్న స్టింగ్ (దొంగ) ఆపరేషన్లు, వీటన్నిటి మధ్య మీడియా సంస్కర్తలుగా మనం చేస్తున్న ఉద్యమాలు.. అసలు వ్యాపార ప్రయోజనాల కోసమే నిర్వహిస్తామంటున్న సంస్థలకు మీడియా హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాలు వర్తిస్తాయా... ఇంకా మీడియాలో జర్నలిజం మిగిలి ఉందా..? దీనికి 'ఛానలిజం' అని పేరు పెట్టుకోవాలా? మీడియా పెద్దలే ఒకసారి ఆలోచించాలి.



రేటింగ్స్‌కి ప్రామాణికత ఎంత?

మీడియాలో పోటీకి, పెడ పోకడలకు అన్నిటికీ కారణం రేటింగ్సే అన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఈ రేటింగ్స్‌ని [illegible] సీరియస్‌గా తీసుకోవాలన్న విషయాన్నీ పరిశీలించాలి. టామ్



సేకరిస్తున్న రేటింగ్స్ అన్నీ శాంపిళ్లమీద ఆధారపడినవే. వాటి శాతాన్ని ఒకసారి గమనిస్తే... దేశంలో సుమారు 12 కోట్ల కేబుల్ టీవీ కనెక్షన్లు ఉన్నట్లు ఒక అంచనా. వంద కోట్ల జనాభా దాటిన దేశంలో పీపుల్ మీటర్లు అమర్చింది కేవలం పన్నెండు వేల ఇళ్లల్లో మాత్రమే. అంటే ఇన్ని కోట్ల జనాభాలో దాదాపు 50 వేలమంది అభిప్రాయమే రేటింగ్‌గా మారుతోంది. ఈ శాంప్లింగ్ విధానంపై సీఎంఎస్ వంటి సంస్థలు ఎన్నో రకాల అభ్యంతరాల్ని లేవనెత్తాయి. ప్రధానంగా పీపుల్ మీటర్ల ఏర్పాటులో పట్టణ ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శ ఉంది. శాంపిల్‌గా తీసుకున్న ఒక ఇల్లు కొన్ని వేల మందికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఏకరూప సమాజాలు కలిగిన కెనడా, అమెరికా వంటి దేశాలకు సరిపడే విధానాన్నే ఇక్కడ అమలు చేయడంపైనా అభ్యంతరాలు ఉన్నాయి. పీపుల్‌మీటర్ ఆపరేషన్‌లోను అనేక సమస్యలు. ఇందులో పల్లెప్రజల అభిమతాన్ని తీసుకోవడానికి ఏమాత్రం వీలుపడదు. ఇండియాలో వినియోగంలో ఉన్న టీవీ సెట్లలో అరవై శాతం పల్లెలు, చిన్న పట్టణాల్లోనే ఉన్నాయని అంచనా. కానీ లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల్ని, మండల కేంద్రాల్ని, గ్రామాల్ని కూడా టామ్ లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఇది ప్రజాభిప్రాయాన్ని ఎలా ప్రతిబింబిస్తుందనేది అంతుబట్టని విషయం. ఇక రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా ఎన్నో తేడాలు, ప్రసారాల్లోను ఎన్నో విలక్షణతలు కనిపిస్తాయి. ఈ విషయంలో టామ్ సమతుల్యత పాటించకపోవడం, ముంబై వంటి నగరాల్లోనే సుమారు వెయ్యి మీటర్లు పెట్టడం పైనా విమర్శలు ఉన్నాయి. అయితే పీపుల్ మీటర్లకు అయ్యే ఖర్చు భారీగా ఉండటం, వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి రావటంతో ఈ విమర్శలన్నిటినీ టామ్ తోసిపుచ్చింది. ఇక కేబుల్ ఆపరేటర్లు ఛానళ్ల ప్లేస్‌మెంట్స్‌ని మార్చే విధానం, మీటర్ల టాంపరింగ్, మేనేజ్‌మెంట్ వంటివి కూడా రేటింగ్‌ని ప్రభావితం చేస్తాయి. పీపుల్ మీటర్లు పెట్టిన ప్రాంతాలతో పాటు, అవి పెట్టిన ఇళ్ల జాబితా కూడా రహస్యమని టామ్ చెబుతున్నప్పటికీ... ఇదొక బహిరంగ రహస్యమని చాలా సందర్భాల్లో నిరూపణ అయింది. స్థానిక ఎంఎస్‌ఓల (మల్టీ సిస్టమ్ ఆపరేటర్) సహకారంతోనే టామ్ పీపుల్ మీటర్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. కాబట్టి వీటి ఆనుపానులన్నీ వారికి తెలుసనేది మీడియా పరిశీలకుల వాదన. దూరదర్శన్ కూడా ఈ రేటింగ్స్ మాయాజాలంలో చిక్కుకొని దిశను మార్చి ప్రయాణించిన సందర్భాలు ఉన్నాయి. అయితే త్వరలోనే తప్పు తెలుసుకొని డార్ట్ విధానంలో డీడీ ప్రత్యేకంగా అభిప్రాయ సేకరణ చేస్తోంది. డార్ట్ అంటే 'దూరదర్శన్ ఆడియన్స్ రేటింగ్'.

మరోవైపు టామ్ ఏకఛత్రాధిపత్యానికి గండి కొట్టేందుకు 2005లో ఇంకో సంస్థ రంగప్రవేశం చేసింది. ఆడియన్స్ మెజర్‌మెంట్ అండ్ ఎనలిటిక్స్ లిమిటెడ్ సంస్థ ఎమ్యాప్‌ని ప్రారంభించింది. అనుకున్నంత వేగంగా ఇది విస్తరించలేకపోయింది. అప్పటికే వంద కోట్ల పెట్టుబడితో ఒక్కో క్లైంట్ దగ్గరా అయిదు నుంచి 15 లక్షల వరకు వసూళ్లు జరుపుతున్న టామ్ మార్కెట్‌లో పాతుకుపోయింది. కానీ ఎమ్యాప్ ఆన్‌లైన్ సేవలు, కోరినవారికి ఏ రోజుకారోజు, ఏ ప్రోగ్రామ్‌కి ఆ ప్రోగ్రామ్ రేటింగ్స్ అందించేందుకు సిద్ధపడింది. ఈ పోటీని అర్థం చేసుకున్న టామ్, వారానికోసారి రేటింగ్స్ ఇవ్వడంతో పాటు తాజాగా 'మిడ్‌వీక్' పేరుతో ముందుగానే 'రిజల్ట్ లీక్' చేస్తోంది.

టెలివిజన్ రేటింగ్స్ సేకరించే పద్ధతి ఒక్క మన దేశంలోనే కాదు, అనేక దేశాల్లో అమల్లో ఉంది. అయితే ఈ విధంగా గుత్తాధిపత్యానికి అవకాశం కల్పించిన దేశాలు మాత్రం చాలా తక్కువ. అందుకే ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్ వంటి సంస్థలు జోక్యం చేసుకోవాలని మీడియా నిపుణులు కోరుతున్నారు. అమెరికాలో టామ్ మాతృసంస్థ "ఏసీ నీల్సన్" ఒంటెత్తుపోకడల విషయంలో ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంది. రేటింగ్స్ ట్యాంపరింగ్‌కి సంబంధించిన అనేక అక్రమాలు వెలుగు చూడటంతో చివరికి కోర్టు మెట్లు కూడా ఎక్కాల్సి వచ్చింది. అమెరికాలో రేటింగ్స్ పర్యవేక్షణకు మీడియా రేటింగ్స్ కౌన్సిల్ ఉన్నప్పటికీ ఈ దారుణాలను పసిగట్టలేకపోయింది. మన దేశంలో అలాంటి వ్యవస్థలేవీ లేవు. నియంత్రణ కోసం ఇదే తరహాలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్నా ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. అనేక సంప్రదింపుల తర్వాత 2010 మేలో భారతదేశంలో రేటింగ్స్, టీవీ ప్రసార వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై అధ్యయనం కోసం ఫిక్కీ సెక్రటరీ జనరల్ అమిత్ మిత్రా ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యుల కమిటీని కేంద్రం నియమించింది. మూడు నెలల కాలపరిమితితో నియమించిన ఈ కమిటీ రేటింగ్ పద్ధతిలోని లోపాలతో పాటు ప్రేక్షక బాహుళ్యాల సామాజిక స్థితిగతులు, శాంపిళ్ల సేకరణతీరు, వాటి కచ్చితత్వం, పరిమాణం, ప్రాంతీయ విలక్షణత, కేబుల్, డీటీహెచ్ వంటి ప్రసార సరఫరా వ్యవస్థల తీరుతెన్నుల్ని కూడా అధ్యయనం చేయనుంది. బ్రాడ్‌కాస్టింగ్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ వంటి వ్యవస్థలు ఏర్పాటు చేయాలన్న ట్రాయ్ ప్రతిపాదనల్ని కూడా అమిత్ మిత్రా కమిటీ పరిశీలించనుంది. సీనియర్ జర్నలిస్టులు, టెలికం, మేనేజ్‌మెంట్ రంగ నిపుణులతో కూడిన ఈ కమిటీ ఆమోదయోగ్యమైన పరిష్కారాలు సూచిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఎందుకంటే భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వస్తున్న పోకడలతో జనం విసిగిపోయి ఉన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే నమ్మకాన్ని కోల్పోయే స్థితిలోకి మీడియా వెళుతుందన్న ఆందోళన ఎక్కువైంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం ఛానళ్లలో విషయాన్ని (కంటెంట్) నియంత్రిస్తోంది. జర్నలిస్టులు కాదు, యాజమాన్యాలు కాదు... ఎంఎస్‌ఓలు, రేటింగ్స్. తమకు నచ్చని విషయాలు టెలికాస్ట్ చేస్తే, వెంటనే ఛానల్ ప్రసారాన్నే ఆపేస్తారు ఎంఎస్‌ఓలు. ఎక్కువగా రాజకీయ ప్రయోజనాలతోనే వీరి సంబంధాలు ముడిపడి ఉంటాయి కనుక, ఒక్క నెగెటివ్ వార్తను కూడా సహించలేరు! ఇక ఎంత అద్భుతమైన ప్రోగ్రామ్ చేసినా రేటింగ్ రాకపోతే వెంటనే ఆపేయమంటుంది యాజమాన్యం. ఎందుకంటే ప్రకటనలకు, స్పాన్సర్‌షిప్‌లకు రేటింగ్సే ప్రామాణికం. ఈ పరిస్థితి తప్పనిసరిగా మారాల్సిన అవసరం ఉంది. ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ మాటల్లో చెప్పాలంటే "పోటీ తత్వం పేరుతో ఒకరిపై ఒకరు నియంత్రణ కోల్పోతున్న దశలో స్వీయ నియంత్రణ అనే అంశాన్ని నేను నమ్మను. ఓ పదేళ్లక్రితం అడిగితే మీడియాకు ఈలక్ష్మణరేఖలేవీ అవసరం లేదనే చెప్పేవాణ్ణి, కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. బ్రిటన్ తరహాలో స్వతంత్రంగా పనిచేసే ఒక రెగ్యులేటరీ వ్యవస్థ మనకు కావాలి. రేటింగ్స్, కేబుల్ వ్యవస్థలతో సహా న్యూస్‌ఛానళ్ల ప్రసారానికి సంబంధించిన అన్ని అంశాల్నీ దీని పరిధిలోకి తీసుకురావడం అత్యవసరం".

(రచయిత మహా టీవీ అవుట్‌పుట్ ఎడిటర్)

కొత్త పుస్తకాలు

మంచి కథల సమాహారం



హాస్యంతోనే పొత్తు అనుకుంటాం కానీ పొత్తూరి విజయలక్ష్మి కథల్లో కుటుంబ సంబంధాలు, మానవీయ విలువలు చిత్తానికి హత్తుకునే విధంగా కనబడుతుంటాయి. హాస్యం చాలా ఆరోగ్యకరం. జంధ్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమా కథ పొత్తూరి విజయలక్ష్మి గారిదే! చాలా కాలం ప్రవాసాంధ్ర జీవితం గడిపినా ఆవిడ కథల్లో అచ్చమైన తెలుగువారి జీవితం పోటీ కథల నిబంధనల్లో లాగా తొణికిసలాడుతుంటుంది. 'చంద్రహారం' అని పేరు పెట్టడంలోనే కథల సంపుటి సొబగు తొణికిసలాడుతోంది. ఆడవాళ్లకి బంగారం మీద మోజు అనుకుంటాంగానీ నిజానికి కుటుంబ ఆర్థిక అవసరాలకు తాకట్టుపడి సమస్యలనుండి గట్టున పడేసేది అదే. మామ్మ పాత గొలుసే అయినా, అది ఎందరిని ఎన్ని సమయాల్లో ఆదుకుందో తెలిసిన వాడు కావడంవల్లే రామచంద్రం అయిదు పేటల గొలుసు మూడుపేటలై లక్ష్మీదేవి రాళ్ల బిళ్లకి ఐదు రింగులు, మూడు రింగులకు గొలుసులు, రెండు రింగులు ఖాళీ అయినా ఖాళీ కాదలచనివ్వని మనసు తీపి గుర్తు కోసం, మామ్మకు ప్రతిరూపంగా, తన స్తోమతకు మించిందే అయినా, అత్తయ్యలకు డబ్బు చెల్లించి సొంతం చేసుకుంటాడు. చెక్కు చెదరకుండా అలా వుండిపోవలసిన తీపిగుర్తుగా 'చంద్రహారం' కథ తీర్చిదిద్దారు రచయిత్రి.

మొత్తం ఇరవై కథల ఈ సంపుటిలో కొన్ని హాస్య కథలూ విజయలక్ష్మి మామ్మతో వున్నాయి. అందులో 'చెత్త కథ' ఒకటి. బండోడియా దేశం సృష్టించి మనదేశంలో బండబారిన రాజకీయాల వైఖరిని వ్యంగ్యంగా తూర్పారబట్టినట్లు చిత్రించారీ కథలో. చెత్తలో కూడా మంచి చెత్త, చెత్త చెత్త వుంటాయని ఈ చెత్త కథ మనకు తెలియజేసే మంచి కథ. ఆకలేసిన పొరుగింటి కోడలుపిల్లకు ఆకు వేసి అన్నం పెట్టే వరలక్ష్మమ్మ, ఒకప్పుడు తమను ఆదుకున్న అయ్యవారికి వృద్ధాప్యంలో ఆసరా కావాలని ఆతృతపడిన కృష్ణుడు ఇలా ఈ కథల్లో ద్యోతకమయ్యే పాత్రలు ఊహాజనిత ఉదాత్త పాత్రలు కాదు. సమాజపు సహజ చిత్రణలోనివే. రచనా వ్యాసంగంలోని ఆరోగ్యాన్ని అర్థం చేసుకున్న రచయిత్రి కావడంవల్లే పొత్తూరి విజయలక్ష్మి కథలు చదివిస్తాయి. మనసుసు కదిలిస్తాయి. హాస్యకథలు సైతం గిలిగింతలు పెడుతూనే ఏదో ఒక మంచి అంశాన్ని వెలిదీసి చూపిస్తాయి. "ఒక్క మాటలో చెప్పాలంటే నేను రచయిత్రిని కాకుండా వుంటే ఏ పిచ్చాసుపత్రిలోనో పేషెంటుగా వుండే దాన్నేమో" అంటారు రచయిత్రి. నేటి పాఠకులు ఈ వర్తమాన సమాజపు పోకడలకు పిచ్చెక్కిపోకుండా ఇలాంటి కథలు చదివితే ఆరోగ్యంగా వుంటారనే హామీ ఇవ్వగల మంచి కథల సంపుటి ఈ చంద్రహారం.

చంద్రహారం (కథలు)
పొత్తూరి విజయలక్ష్మి
వెల : 120/-
శ్రీ రిషిక పబ్లికేషన్స్
ఫ్లాట్‌నెం.201,
వికాసిని అపార్ట్‌మెంట్స్,
న్యూనల్లకుంట,
హైదరాబాద్ 44.

- సుధామ

చక్కటి ఆలోచన...ఆచరణ

లలిత కళల ప్రస్తావన లేని జీవితం ఊహకు అందదు. లలిత కళలు అనగానే అందరి మదిలో మెదిలేది సంగీత నాట్యాలు. ఇవి మానవ జీవితంతో ఎంతగా పెనవేసుకుపోయాయంటే, బహుశా ప్రతిరోజూ ఏదో ఒక రూపంలో... ఏదో ఒక రంగంలో ప్రతి హృదయాన్నీ తాకుతూనే వున్నాయి. కళలను జీవితంగా మార్చుకున్న వారు కొందరైతే, అదే కళను జీవితంలో భాగంగా మార్చుకున్నవారు మరికొందరు. కనీసం ఆ కళలను ఆస్వాదిస్తూ అదే గొప్ప అదృష్టంగా భావించేవారు ఇంకొందరు. అంతటితో ఆగక కళనే వ్యాపారంగా మార్చినవారూ లేకపోలేదు.

ప్రతి ఒక్కరికీ తమ తమ అభిమాన కళాకారుల గురించి, కళలను గురించి తెలుసుకోవాలని అనిపించకపోదు. అలా అనిపించినా సమయం దొరకకపోవడం లేదా అందరి జీవిత విశేషాలు ఒకేచోట పొందుపరచి ఉండకపోవచ్చు. బహుశా అటువంటి రసజ్ఞుల జిజ్ఞాసను మదిలో ఉంచుకొని డా॥జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు అందించిన 'సంగీత మేరు శిఖరాలు' అనే ఈ పొత్తము ఒక చక్కటి ఆలోచన, ఆచరణ. తెలుగు భాషపై పట్టు, అభిమానం ఉన్న వారిలో పెక్కు మందికి ఈ రచయిత సుపరిచితులే.

ఇక పుస్తకంలోకి తొంగిచూస్తే కర్ణాటక, హిందూస్తానీ సంగీతంలో గాత్రం, వాద్యం మొదలు సినిమా సంగీతం వరకూ ప్రతి హృదిలో పీఠం వేసుకుని కూర్చున్న ప్రముఖ విద్వాంసుల జీవితాలను, జీవిత విశేషాలను పొందుపరిచారు. కళలకు కుల, మత, భాష, వేష బేధాలు లేవని మరొక్కసారి ఈ పుస్తకం రుజువు చేసింది. సంగీత త్రిమూర్తులు (త్యాగయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు), సంగీత సామ్రాజ్ఞులు (ఎమ్.ఎస్ సుబ్బులక్ష్మి, పట్టమ్మాళ్, ఎమ్.ఎల్ వసంత కుమారి), స్వాతి తిరునాళ్, పండిట్ రవిశంకర్, ఘంటసాల, లతామంగేష్కర్, ఏసుదాసు, హరిప్రసాద్ చౌరాసియా, ముత్తయ్య భాగవతార్, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ జోషి ... ఇలా చదువుతున్న కొద్దీ ఇంకా ఇంకా తెలుసుకోవాలనే ఆత్రుత ఆద్యంతం అందించారు రచయిత. కానీ చంద్రునిలో కూడా మచ్చలున్నట్లు ఇంకా ఎందరో ప్రముఖ సంగీత విద్వాంసుల ప్రస్తావన రాకపోవడం ఒకింత బాధాకరం. ప్రముఖుల జీవిత విశేషాలు అందించిన తీరు బాగున్నా, పాఠకులు ఆశించినంత సమాచారం అందక నిరుత్సాహపడే అవకాశం కూడా కనిపించక మానదు.

ఇక కొసమెరుపుగా అనుబంధం పేరిట సంగీతం ఏ విధంగా రోగనివారకమో చారిత్రక సాక్ష్యాలతో అందించారు రచయిత. ఏ ఏ రాగం ఏ ఏ రోగాలను నివారించగలదో, ఏఏ రాగాన్ని ఏఏ సమయాలలో పాడాలో కూడా విశదీకరించారు.

సంగీత మేరు శిఖరాలు
డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి
వెల : 70/-
ప్రతులకు
విశాలాంధ్ర పబ్లికేషన్స్,
4-1-435,
విజ్ఞాన భవన్, అబిడ్స్,
హైదరాబాద్ 44.

- ఎస్.నాగశిరీష

కథ

రెండు రోజుల పాటు తెలిసిన వాళ్లందరి దగ్గరా ప్రయత్నించి మూడు వేల రూపాయలు సంపాదించాడు రాము. మిగిలిన డబ్బు ఎలా అని ఆలోచిస్తుండగా భార్య మెడలో ఉండే బంగారు మంగళ సూత్రం గుర్తుకొచ్చింది. దాన్ని తీసుకెళ్లి తాకట్టు పెడితే సరిపోతుంది అనుకొని రాత్రికి ఇంటికెళ్లి....

'అరుణా తెలిసిన వాళ్లందరి దగ్గర ప్రయత్నించాను. మూడు వేలు మాత్రం దొరికాయ్. మిగిలిన డబ్బు కావాలంటే.....కావాలంటే....చెప్తే నువ్వేమి అనుకోకూడదు.' నసిగాడు రాము.

'చెప్పండి ఫర్వాలేదు'

కాన్వెంట్ చదువు

-గోరంట్ల వెంకటేష్‌బాబు

రాము, కృష్ణ ఇద్దరూ పట్టణంలోని ఓ బట్టల దుకాణంలో సేల్స్‌మెన్లుగా పనిచేస్తున్నారు. జీతం చెరి నాలుగువేలు. రాముకి పెళ్లయింది. ఓ పాప కూడా.

'ఏరా రాము అలా ఉన్నావేంటి. ఒంట్లో ఏమైనా బాగోలేదా?' అడిగాడు కృష్ణ.

'అదేం లేదురా. ఈ రోజు స్కూళ్లు తెరిచారు కదా మా అమ్మాయిని పంపించాను. బాగా చదువుతోందని ఎల్‌కెజిలో వేయకుండా యుకెజిలో వేశారు. సాయంత్రం వస్తే ఫీజు ఎంత కట్టాలో చెప్తానన్నారు. పోయిన ఏడాది బేబి క్లాసుకి మూడు వేలు తీసుకున్నారు. ఈసారి ఎంత అడుగుతారోనని ఆలోచిస్తున్నాను. ప్రస్తుతం నా దగ్గర డబ్బు లేదు. మొన్ననే అమ్మకి కంటి ఆపరేషన్ చేయించాను చూపు సరిగ్గా కనిపించట్లేదంటే. ఇప్పుడు ఫీజు కింద ఏ అయిదు వేలో, ఆరు వేలో తెచ్చి కట్టమంటే ఎక్కడ్నుంచి తీసుకొచ్చికడతాం' జవాబిచ్చాడు రాము.

'అయితే గవర్నమెంటు బళ్లో చేర్పించలేకపోయావా?'

'భలే చెప్పావురా. అక్కడ గాని చేర్పిస్తే ఎప్పుడూ సెలవులే. చదువు సరిగా చెప్పరు. అదే ప్రయివేటు బడనుకో ఇంగ్లీషు బాగా వస్తుంది. సెలవులు ఎక్కువగా ఉండవు. క్రమశిక్షణలో ఉంటారు.'

'ఇలాగే ఉంటుంది రాము చిన్న వయస్సులోనే పెళ్లి చేసుకొంటే. ఆ రోజు మేం చెప్తే విన్నావా? మేం ఇద్దరం ఇష్టపడుతున్నాం అని ఇరవై ఒక్క సంవత్సరాలకే పెళ్లి చేసుకొన్నావ్. ఇప్పుడు అనుభవిస్తున్నావ్'

'అవున్రా కృష్ణా నువ్వు చెప్పింది నిజమే....'

ఇంతలో ఒక కస్టమర్ వచ్చాడు. సూపర్‌వైజర్ వీళ్లిద్దరి దగ్గరకు వచ్చి 'మీరిద్దరూ బాతాఖానీ ఆపండి. రాము! ముందు ఆ సార్‌కి ఏం కావాలో చూపించండి' అన్నాడు.

'సరేలే రాము ఫీజు ఎంత కట్టాలో రేపు చెప్పు, ముందు ఆ సార్ సంగతి చూడు' అని కృష్ణ పక్కకి వెళ్లాడు.

సాయంత్రం రాము సూపర్‌వైజర్‌ని పర్మిషన్ అడిగి తీసుకొని స్కూలు దగ్గరకు వెళ్లాడు. అక్కడ మేడం పిల్లలందర్ని ఎవరింటికి వాళ్లని పంపించే ఏర్పాట్లలో ఉంది. ఇంతలో అక్కడికి వచ్చిన రాముని చూసి...

'మీరు మమత ఫాదర్ కదా' అంది మేడం.

'అవును మేడం ఫీజు సంగతి చెప్తారని వచ్చాను'

'రండి కూర్చుని మాట్లాడుకుందాం. పాప ఆడుకుంటూ ఉంటుంది. ఏం ఫర్వాలేదు.'

రాము, మేడం ఇద్దరూ ఆఫీసు రూంలోకి వెళ్లారు. 'మీపాప చాలా బాగా చదువుతుంది. ఏమైనా అడిగితే టకాటకా అప్పజెప్తుంది. అందుకని బేబి క్లాసు నుంచి యూకేజికి వేశాం. ఇకపోతే ఈ సంవత్సరం మీరు కట్టాల్సిన ఫీజు అయిదువేల రూపాయలు' అంది మేడం రాముతో.

మేడం చెప్పిన ఫీజు అమౌంటు విని షాకయ్యాడు. వెంటనే తేరుకొని 'మేడం మీరు చాలా ఎక్కువ చెప్తున్నారు. అంత చిన్న పాపకి అయిదువేలా? అంత డబ్బు కట్టాలంటే నాకు చాలా కష్టం. నేనేదో బట్టల షోరూంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాను. మరీ అయిదువేలంటే ఎలా చెప్పండి మేడం. కాస్త తగ్గించకూడదా?'

'ఇదేం బట్టల దుకాణం కాదండీ. డిస్కౌంటు ఇవ్వడానికి. స్కూలు. అయినా అయిదు వేలంటే చాలా తక్కువ. ఇంకా ఎక్కువ తీసుకొనేవాళ్లున్నారు. లక్షల్లోకి వెళ్లిపోయాయి స్కూలు ఫీజులు. ఒక విధంగా చెప్పాలంటే సీటు దొరకాలంటేనే కష్టమవుతోంది. చెప్తున్నా వినండి మన స్కూల్లో ఏయే సదుపాయాలు ఉన్నాయంటే మీ పిల్లలకు కంప్యూటర్ నేర్పిస్తాం. స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు, క్వాలిఫైడ్ టీచర్లతో బోధన, వీడియో సీడీల ద్వారా టీచింగ్, ఇంకా ప్రతి సబ్జెక్టుకు బుక్స్, ఇవేగాక టీచర్లు, వాళ్లకి జీతాలు, వ్యాన్ ఇవన్నీ ఉంటాయి. అందులోనూ ఈ సంవత్సరమే కొత్తగా గేమింగ్ జోన్‌ను మన స్కూల్లో స్టార్ట్ చేశాం. ఇది మన ఊళ్లో మరే స్కూల్లో లేదు. ఇన్ని ఉన్నాయి. ఇప్పుడు చెప్పండి మిమ్మల్ని డబ్బు ఊరకనే అడుగుతున్నామా?' మేడం వివరంగా చెప్పేసరికి రాము కాదనలేక కన్విన్స్ అయిపోయి...

'సరే మేడం మరో నాలుగు రోజుల్లోగా కడతాను. బుక్స్ ఎప్పుడిస్తారు?' అని అడిగాడు.

'కనీసం సగం డబ్బు కడితే ఇస్తారు. కానీ మీ పరిస్థితి చెప్పారు. కాబట్టి నేను రేపు ఇంటికి

మేడం చెప్పిన ఫీజు అమౌంటు విని షాకయ్యాడు. వెంటనే తేరుకొని 'మేడం మీరు చాలా ఎక్కువ చెప్తున్నారు. అంత చిన్న పాపకి అయిదువేలా? అంత డబ్బు కట్టాలంటే నాకు చాలా కష్టం. నేనేదో బట్టలు అమ్మే షోరూంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాను. మరీ అయిదువేలంటే ఎలా చెప్పండి మేడం. కాస్త తగ్గించకూడదా?'

'ఇదేం బట్టల దుకాణం కాదండీ. డిస్కౌంటు ఇవ్వడానికి. స్కూలు. అయినా అయిదు వేలంటే చాలా తక్కువ. ఇంకా ఎక్కువ తీసుకొనేవాళ్లున్నారు. లక్షల్లోకి వెళ్లిపోయాయి స్కూలు ఫీజులు. ఒక విధంగా చెప్పాలంటే సీటు దొరకాలంటేనే కష్టమవుతోంది. చెప్తున్నా వినండి మన స్కూల్లో ఏయే సదుపాయాలు ఉన్నాయంటే మీ పిల్లలకు కంప్యూటర్ నేర్పిస్తాం. స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు, క్వాలిఫైడ్ టీచర్లచే బోధన, వీడియో సీడీల ద్వారా టీచింగ్, ఇంకా ప్రతి సబ్జెక్టుకు బుక్స్. ఇవేగాక టీచర్లు, వాళ్లకి జీతాలు, వ్యాన్ ఇవన్నీ ఉంటాయి.



పంపిస్తాను. మీరు నాలుగు రోజుల తర్వాత మొత్తం ఫీజు కట్టేయండి' అంది మేడం.

రాము పాపను తీసుకొని ఫీజు ఎలా కట్టాలబ్బా అని ఆలోచించుకుంటూ ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన భర్తకు మంచి నీళ్ల ఇస్తూ 'ఏమండి మేడం ఎంత ఫీజు కట్టాలన్నారు' అనడిగింది రాము భార్య అరుణ.

'అయిదు వేలు' చెప్పాడు రాము.

'అమ్మో అంత! ఎక్కడ్నుంచి తీసుకొచ్చి కడతారు. ఇంకా జీతం వచ్చేదానికి పది రోజులుంది. అవి వచ్చినా చాలా కష్టం. ఇంటద్దె కట్టాలి, పాలవాడికి రెండునెలల నుంచి డబ్బులివ్వలేదు. కూరగాయలు, బియ్యం... అబ్బా అసలే పెరిగిన రేట్లతో ఇల్లు గడవక చస్తున్నాం. దీన్ని తీసుకెళ్లి ఏ గవర్నమెంటు స్కూల్లోనే పడేయమని చెప్పాను కదా. చెప్తే విన్నారు కాదు.'

'నువ్వు గమ్ముగుండు అరుణా. ఎలాగోలా కడతాలే. ఇక్కడైతే నా బిడ్డకు అన్నీ నేర్పిస్తారు. అదే గవర్నమెంటు బళ్లో కంప్యూటర్, ఇంగ్లీషు నేర్పిస్తారా చెప్పు'

'యుకేజికే ఇవన్నీ అవన్నీ అవసరమా?'

'అబ్బబ్బ ఎలాగోలా తెచ్చి కడతాను కదా. నా బాధ నాది. ముందు పాపకి తినేదానికి ఏమన్నా పెట్టు'

'ఆ అయిదువేలుతో పోతుందనుకొనేరు. యూనిఫాం కుట్టివ్వాలి. బూట్లు కొనాలి. చాలా తతంగం ఉంటుంది. ఇంకో వెయ్యి రూపాయలు పైనే అవుతుంది. పోయిన సంవత్సరం స్కూలు ఫీజుకి చేసిన మూడువేలు అప్పే రెండునెల్ల క్రితం తీర్చారు. ఈసారి చేసే అప్పు ఇంకెప్పుడు తీరుస్తారో?'

ఈ మాటలు విన్న రాము ఏం మాట్లాడకుండా మిన్నకుండిపోయాడు. పక్కరోజు షాపుకెళ్లాడు రాము. షాపుకొచ్చిన రాముని కృష్ణ 'ఏరా ఎంతడిగారు ఫీజు' అని ప్రశ్నించాడు.

'అయిదువేలు" జవాబిచ్చాడు రాము.'

'అంతెందుకురా?'

'రేయ్ నన్ను చంపుకు తినకండి. నిన్న మాఆవిడ. ఈ రోజు నువ్వు. మీకు సమాధానం చెప్పడం నావల్ల కాదు. ముందు ఓ మూడు వేలు రెడీచేయ్ మళ్లీ ఇస్తాను'

'మళ్లీ అంటే సంవత్సరానికా? ఇప్పుడు నాదగ్గర లేవు'

'నువ్వే అలా అంటే ఎలా చెప్పు కృష్ణా. ఎలాగోలా చూడు. మిగిలిన డబ్బు నేను చూసుకుంటా. ఇంకో మూడు రోజుల్లోగా కట్టాలి'

'కష్టం రాము. మా ఇంటి రిపేరు కోసం బ్యాంకులోను తీసుకొన్నాను. నీకు తెలుసుకదా. అది ప్రతినెలా కట్టాలి. లేదంటే వడ్డీ పెరిగిపోతుంది. అందుకని దాన్ని వెంటనే పూర్తి చేయాలి. అందువల్ల ప్రస్తుతం నన్ను అడగొద్దు. అర్థం చేసుకో'

'అయితే ఇప్పుడెలారా?'

'నేనేం చేయలేను. ప్రస్తుతానికి నన్ను వదిలేయ్'

రెండు రోజుల పాటు తెలిసిన వాళ్లందరి దగ్గరా ప్రయత్నించి మూడు వేల రూపాయలు సంపాదించాడు రాము. మిగిలిన డబ్బు ఎలా అని ఆలోచిస్తుండగా భార్య మెడలో ఉండే బంగారు మంగళ సూత్రం గుర్తుకొచ్చింది. దాన్ని తీసుకెళ్లి తాకట్టు పెడితే సరిపోతుంది అనుకొని రాత్రికి ఇంటికెళ్లి....

'అరుణా తెలిసిన వాళ్లందరి దగ్గర ప్రయత్నించాను. మూడు వేలు మాత్రం దొరికాయ్. మిగిలిన డబ్బు కావాలంటే.....కావాలంటే....చెప్తే నువ్వేమి అనుకోకూడదు.' నసిగాడు రాము.

'చెప్పండి ఫర్వాలేదు'

'నీ మెడలోని ఆ దండ ఇస్తే తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చి పాప స్కూలు ఫీజు కట్టేద్దాం. నిదానంగా ఆ అప్పు తీర్చి దండ నీకు మళ్లీ ఇప్పించేస్తాను. ఏమంటావ్?'

'ఈ మాత్రం దానికేనా నసుగుతున్నారు. మనలాంటివాళ్ల ఇళ్లలో ఇలాంటివి మామూలే. ఒకటి బయటికిపోతేగాని ఇంకోటి లోపలికి రాదు' అని మెడలోని తన దండను తీసిచ్చింది. అడగ్గానే కోప్పడకుండా దండ ఇచ్చిన అరుణని చూసి రాము ఆశ్చర్యపోయాడు.

పక్కరోజు ఉదయాన్నే ఆ బంగారు దండను తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో తన పాప స్కూలు ఫీజు కట్టాడు.

రాత్రికి ఇంటికి వచ్చి 'ఇదిగో అరుణా మిగిలిన డబ్బు. పాపకు యూనిఫాం, బూట్లు కొనిపెట్టు' అని 'మొన్నేమో దీనికి అంత డబ్బు ఖర్చుపెట్టడం అవసరమా అన్నావ్. నిన్న అడగ్గానే నీ దండ ఎందుకు ఇచ్చేశావ్' అనడిగాడు.

'మీరెటూ తిరిగి నేను చెప్పిన మాట వినరు. నేనివ్వకపోయినా ఎక్కడో ఒక దగ్గర్నుంచి తీసుకొచ్చి కడతారు. అందుకు అడగ్గానే ఇచ్చింది. ఇక ఆ దండ ఎన్ని సంవత్సరాలకు తిరిగి వస్తుందో?' అని లోపలికి వెళ్లిపోయింది అరుణ.

రాము పాప పుస్తకాలకు అట్టలు వేసేందుకు కూర్చున్నాడు.

★

మసకబారిన క్యారెక్టర్ పాత్రలు

సినిమా అంటే హీరో హీరోయిన్లే కదా.. ఫలానా హీరో సినిమా అంటారు.. అందుకోసం ఎదురు చూస్తారు.. బాగుంటే కేరింతలు కొట్టడం, బాగాలేకుంటే చప్పుడుచేయకుండా సర్దుకోవడం ఇవన్నీ మామూలే. మొత్తం ప్రచారమంతా ఆ హీరోల చుట్టూనే! కొంతవరకు హీరోయిన్లు ఆ పైన కమెడియన్లు, కొత్తగా వచ్చిన వారైతే విలన్లు.. అంతే! అయితే ఏ చిత్రం కూడా వీళ్లతోనే పూర్తయిపోదు. వీళ్లకు తోడుగా అనేక ఇతర పాత్రలుంటాయి. అవే క్యారెక్టర్ పాత్రలు.



- తె.ర

తమాషా ఏమంటే అసలు క్యారెక్టర్ అంటేనే పాత్ర. మరి క్యారెక్టర్ పాత్రలేమిటి అంటే ఇది సినిమా భాష. నాయికానాయకుల చుట్టూ తిరిగే సినిమా రంగంలో ఇతరత్రా ప్రాధాన్యత గల పాత్రలను ఆ పేరుతో పిలవడం కద్దు. మామూలు భాషలో చెప్పాలంటే తల్లులు, తండ్రులు, అన్నలు, వదినెలు, అత్తలు మామలు, పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, జానపదాల్లో రాజులు మంత్రులు వంటి పాత్రలు. ఇవన్నీ చెబుతుండగానే పాఠకుల కళ్లలో కొందరు మహామహులైన నటీనటులు కదలాడటం మొదలెడతారు. సందేహం లేదు- నాలుగు పదులకు అటూ ఇటుగా వున్నవారికి ఆ పై వారికి ముందుగా గుర్తుకు వచ్చే గంభీర విగ్రహుడు ఎస్వీఆర్. తర్వాత గుమ్మడి. కొంత వరకు నాగయ్య, ఆ పైన మిక్కిలినేని, ముక్కామల, సీఎస్సార్, ధూళిపాల తదితరులందరూ.. వాళ్లతో పాటు కన్నాంబ, హేమలత, లక్ష్మీరాజ్యం, సూర్యకాంతం, ఛాయాదేవి (వీళ్లది మరో ప్రత్యేక తరహా) జూనియర్ శ్రీరంజని, రుష్యేంద్రమణి, జి.వరలక్ష్మి, ఎస్.వరలక్ష్మి తదితరులు కూడా.

వీరిలో అనేకులు కొనసాగుతుండగానే తర్వాతి తరంలో నిర్మల, సావిత్రి, భానుమతి, అంజలి, జమున, జయంతి, తర్వాత్తర్వాత శారద, సుహాసిని వంటి వారు మరో వైపున జగ్గయ్య, ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, రావుగోపాలరావు, కాంతారావు వంటివారు ఈ జాబితాలో ప్రవేశించారు. దీన్ని పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతుంది. కొంత కా లం హీరోలుగానో విలన్లుగానో ఒ క వెలుగు వెలిగిన వారు నెమ్మదిగా క్యారెక్టర్ నటులై స్థిరపడిపోతారని. వయసులో ప్రమోషన్ వృత్తిలో కొంత రివర్షన్‌గా అవుతుందని.

నాటకరంగంలో తక్కువ స్థాయి నటులే వుంటారు తప్ప పాత్రలుండవంటాడు ప్రజానాట్యమండలి నిర్మాత డా॥రాజారావు. నిజంగానే మంచి నటీనటులు అయిదు నిముషాలలోనే అద్భుతమైన అనుభూతిని అందించగలుగుతారు. అయితే అదంతా కళా రంగ సూత్రాలను కచ్చితంగా పాటించినప్పుడు. అలా జరిగినంత కాలం పరిశ్రమలో సహాయ నటులకు కూడా చాలా ప్రాధాన్యత వుండేది. ఎన్టీఆర్, ఏఎన్నార్‌లను గురించి చెప్పుకున్నట్టే జనం గుమ్మడి, ఎస్వీఆర్‌లను కూడా అనుకునేవారు. ఇంకా చెప్పాలంటే ఎస్వీఆర్ హీరోలకు సమానమైన ప్రాభవం అనుభవించాడు. ఆయన హావభావాలు సంభాషణలు జనం అదేపనిగా చెప్పుకుంటుండేవారు. మహిళల్లో కన్నాంబ కూడా అంతే వైభవం గడించారు. ప్రతి చిత్రంలో కొన్ని కీలకమైన సన్నివేశాలు క్యారెక్టర్ నటుల ప్రతిభను ప్రతిబింబించేరీతిలో వుండేవి. ఆ మాటకొస్తే హీరోలు కూడా కొండ అద్దమందు కొంచెమై వుండదా అన్నట్టు కాస్త అప్రధానంగా కనిపించేందుకు వెనుకాడేవారు కాదు. అర్థాంగి చిత్రంలో అక్కినేని అమాయకుడు కాగా భార్య పాత్రలో సావిత్రిదే ప్రాధాన్యత. ఆత్మ బంధువులో ఎన్టీఆర్ బండాడిలా కనిపిస్తే అతన్ని కొడుకులా చూసుకునే ఇంటిపెద్ద ఎస్వీఆర్‌దే సగం వరకూ కీలక పాత్ర (ఈ చిత్రంలో ఆయనను హీరోగా చూపించడం గాక పాత్రను హైలెట్ చేస్తేనే కోపంవచ్చిందని ఇటీవల కాట్రగడ్డ నరసయ్య గారు ఈ సంచికలో రాశారు. ఏమంటే ఎన్టీఆర్ కూరగాయలు మోసుకుంటూ వస్తున్న స్టిల్‌ను ప్రచారంలో వాడటం ఆయనకు అంతగా నచ్చలేదట). అక్కినేని హీరోగా వున్నప్పుడే మరో ప్రపంచం 'సుడిగుండాలు' వంటి స్వంత చిత్రాల్లో క్యారెక్టర్ పాత్రల్లో నటించారు. ఎన్టీఆర్ స్వంత చిత్రాలైన 'తోడుదొంగలు, పిచ్చి పుల్లయ్య' వంటి వాటిలో గ్లామర్ లేని పాత్రలనే ధరించారు. ఇలాటి ఉదాహరణలు చాలా వున్నాయి. మొత్తంపైన పాత్రలు కనిపించడమే ఇక్కడ ప్రధానం తప్ప

హీరోయిజం కాదు. ఇదే సూత్రం నాయికలకూ వర్తిస్తుంది. కన్నాంబ వంటి వారు నాయికలుగా వెలుగు వెలిగిన తర్వాత క్యారెక్టర్ పాత్రలవైపు వచ్చారు గనక వారికి సహజంగానే ప్రాధాన్యత వుండేది. శాంత కుమారి కూడా అంతే. పైగా ఆమె భర్త పి.పుల్లయ్య పెద్ద దర్శక నిర్మాత. 70 వ దశకంలో 'మనుషులు మారాలి' సినిమాతో నిర్మల మాస్ తరహా క్యారెక్టర్ పాత్రలకు ప్రతీకగా మారిపోయింది. అప్పటి నుంచి మూడు దశాబ్దాల పాటు అంటే రాజేంద్ర ప్రసాద్ చిత్రాల్లో బామ్మగా వేసినంత వరకూ కూడా నిర్మలమ్మ చిత్రాలకు ఆకర్షణగానే వున్నారు. అయితే అంతకంతకూ ఈ పాత్రలకు ప్రాధాన్యత, గౌరవం తగ్గిపోతున్నాయని ఆమె ఆవేదన చెందుతుండేవారు. భానుమతి పెద్ద నిర్మాత గనక ఆమె కోరుకున్నట్టు సినిమాలు తీసుకోగలిగేవారు. తర్వాత కాలంలోనూ ఆమె బామ్మ వేషం కట్టినా కథ ఆమె చుట్టూనే తిరిగేది. అందరికన్నా ఎక్కువ కాలం నాయికగా కనిపించిన జమున 'పండంటి కాపురం' వంటి చిత్రాల్లో ధరించిన క్యారెక్టర్ పాత్రలు గొప్ప సంచలనం కలిగించాయి. కథకులు, దర్శకులు వాటికి ఆ విలువ నిచ్చేవారు. సావిత్రి నాయికగా గొప్పగా రాణించినా క్యారెక్టర్ పాత్రల దశలో బలహీనంగానే వుండిపోయారు. దాసరి నారాయణరావు మాత్రమే ఆమెను అక్క అనిపిలుస్తూ వేషాలు కల్పించేవారు.

తెలుగులో తొలి స్టార్ హీరో అయిన నాగయ్య పెద్ద వయసులో ప్రధానంగా కరుణ భక్తి ప్రధానమైన క్యారెక్టర్ పాత్రలు ధరిస్తే ఆయనకు సరిజోడిగా వుండిన నెగిటివ్ పాత్రధారి సిహెచ్ నారాయణరావు బాగా ఆలస్యంగా ఆ తరహా వైపు వచ్చారు. ప్రతినాయకులుగా బాగా ప్రసిద్ధికెక్కిన నాగభూషణం, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు వంటివారు ఏక కాలంలో క్యారెక్టర్ నటులుగానూ మారిపోవడానికి కె.విశ్వనాథ్ చిత్రాలు బాగా ఉపయోగపడ్డాయి. వారు కూడా బాగా నటించి జనాన్ని మెప్పించారు కూడా. ఇక హీరోగా ప్రయత్నించి విఫలమైన రమణమూర్తి 'ఒకే కుటుంబం' చిత్రంతో చిన్న పాత్రలు వేయడం మొదలుపెట్టి 'అమాయకురాలు'తో స్థిరపడ్డారు. తర్వాత కాలంలో విశ్వనాథ్ చిత్రాలు ఆయనను బాగా నిలబెట్టాయి. ఉత్తరోత్తరా ఆయన సోదరుడైన సోమయాజులు 'శంకరాభరణం' చిత్రంతో ఏకంగా ప్రధాన పాత్రధారి అయిపోయాడు.

నాయికగానూ అభినయ ప్రధానమైన పాత్రలు వేసిన శారద క్యారెక్టర్లలోనూ బాగా విజయవంతమైనారు. ఎనభైలలో అయిదారేళ్ల పాటు ఆమె పాత్రనే ప్రధానాకర్షణగా చిత్రాలు వచ్చాయి. ఇదే కాలంలో శరత్‌బాబు క్యారెక్టర్ పాత్రలలోనే ప్రత్యేకంగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. 'రాధా కళ్యాణం, అభినందన, సీతాకోక చిలుక, సితార, సాగరసంగమం' వంటి చిత్రాల్లో ఆయన నటనకు ప్రేక్షక జనం నీరాజనాలర్పించారు. అయితే తర్వాత కాలంలో క్రమేణా ఆయన కనిపించడం తగ్గింది. ఇటీవల బాగా విజయవంతమైన 'మగధీర'లో కూడా రాజుగా నటించారు. విలన్ పాత్రధారులు క్యారెక్టర్ నటులుగా రాణించే వరవడి మొదట కోట శ్రీనివాసరావుతో అంతకు మించి ప్రకాశ్ రాజ్‌తో మరోసారి రుజువైంది. దాదాపు పదేళ్లపాటు ఆయన ఈ రెండు రకాలుగానూ తెలుగు, తమిళ ప్రేక్షకులను కట్టిపడేశారు. అదే కాలంలో తనికెళ్ల భరణి, గిరిబాబు, చలపతి రావు, ఆహుతి ప్రసాద్, చంద్రమోహన్, నరేష్, డబ్బింగ్ జానకి, సుధ, సన, వంటి వారు ఈ కాలంలో క్యారెక్టర్ పాత్రలను పోషిస్తూ వచ్చారు. నాయకలుగా వెలుగు వెలిగిన జయసుధ, సుహాసిని వంటివారు క్యారెక్టర్ పాత్రల్లోనూ విజయవంతమైనారు. ఇదే కోవలో సీత, నగ్మా, భానుమతి వంటి వారు కూడా క్యారెక్టర్ పాత్రల వైపు వచ్చినా పరిమితంగానే వుండిపోయారు. వాణిశ్రీ వంటి వారు కొద్దిగా ప్రయత్నించి విరమించుకున్నారు. ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం కొంత కాలం నటించారు. అలాగే కె.విశ్వనాథ్ బాగా జయప్రదమైనా పరిమితంగానే నటిస్తున్నారు.

ఇప్పుడు చెప్పాలంటే క్యారెక్టర్ తరహాలో ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసే నటులు గాని పాత్రలు గాని చాలా తక్కువగానే వుంటున్నాయి. కారణం హీరోలకు శ్రుతిమించిన ప్రాధాన్యత నివ్వడమే. ఇతర సహాయ పాత్రలలోనైనా వయసు మళ్లినవారైనా సరే తమ కంటే కీలకంగా కనిపించడాన్ని హీరోలు హర్షించలేకపోతున్నారనిపిస్తుంది. కృష్ణ చిత్రాల్లో తారాతోరణంలా ప్రముఖులందరూ కనిపించేవారు. ఆయన కుమారుల చిత్రాల్లోనూ ఆ పద్ధతి కొనసాగింది. కాని ఇప్పుడు అది కొంచెం మారినట్టు కనిపిస్తుంది. ఉదాహరణకు 'చిరుత' చిత్రంలో తల్లి పాత్ర చాలా కీలకమైనా దానికి ప్రముఖులెవరినీ తీసుకోకపోవడం! ఈ సంప్రదాయం చిరంజీవి, పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, నాగార్జున వంటి వారి చిత్రాల్లో మనం స్పష్టంగా చూడొచ్చు. వారి వారసులు వచ్చేసరికి మరింతగా ఇతర పాత్రల ప్రాధాన్యతకు కత్తెర వేయడం జరుగుతున్నది. ఇంకా చెప్పాలంటే చిత్రంలో ప్రతి సన్నివేశంలోనూ హీరో ప్రధానంగా వుండాల్సిందే. నాయికలను కూడా తరచూ మారుస్తూ ఎవరూ పెద్దగా నిలదొక్కుకోకుండా చేయడంలో ఆకర్షణే కాక ఈ కోణం కూడా వుంది.

గతంలో వలె క్యారెక్టర్ పాత్రలకు ప్రసిద్ధ నటీనటులు సిద్ధం కాకపోవడం వెనక ఇవన్నీ కారణాలున్నాయి. ఒకవేళ ప్రతిఫలం ఇచ్చినా పాత్ర ప్రాధాన్యత లేకపోతే వారు ఇష్టపడరు. దీనివల్ల కలుగుతున్న నష్టం ఏమిటంటే నవరసభరితంగా వుండవలసిన తెలుగు సినిమాలు మూస ధోరణిలోకి మారిపోతున్నాయి. వైవిధ్య భరితమైన పాత్రలకూ, నటనకూ అవకాశాలు కుదించుకుపోయి కేవలం నృత్యాలు, పోరాటాలు, సాంకేతిక నైపుణ్యాలే మిగులుతున్నాయి. ఇది మాత్రం వాంఛనీయం కాదు. ఒక హీరో పారితోషికంతో ఎందరు మంచి నటులకైనా అవకాశం కల్పించవచ్చునని మన పరిశ్రమ తెలుసుకోవడం శ్రేయస్కరం. కుటుంబ సంబంధాలు మానవీయ విలువలు అడుగంటిపోతున్న నేటి వాతావరణంలో ఇది మరింత అవసరం.

★



డబ్బాలో చిలక



హలో... హాయ్! అప్పడే స్కూలు, ట్యూషను అంటూ బిజీ అయిపోయారా? అలాగైతే ఎలాగర్రా. కాస్త ఆటలకు, పాటలకు కూడా సమయం వెచ్చించాలి. అందుకే మీకోసం ఇవాళ డబ్బాలో చిలక తీసుకొచ్చాం. మరి మేం చెప్పినట్టే చేసేస్తారా?

ఏమేం కావాలంటే..

నీళ్ల బాటిల్ (ప్లాస్టిక్‌ది), మందపాటి అట్ట, చాకు, ఖాళీ రీఫిల్.

ఎలా చేయాలంటే...

ముందుగా మీరు బాటిల్ తీసుకోండి. సరిగ్గా మధ్యకు దీన్ని కత్తిరించాలి. అవసరమైతే అమ్మావాళ్ల సాయం తీసుకోండి. చాకుతో పనంటే జాగ్రత్తగా వుండాలికదా. అందుకన్నమాట. ఇంక ఇప్పడు మందపాటి అట్ట తీసుకోండి. దాని మీద చిలుక బొమ్మ వేయండి. ఇది మరీ పెద్దగా వుండకూడదు. మరీ చిన్నగా వుండకూడదు. సరిగ్గా బాటిల్‌లో పట్టేలా వుండాలి. ఈ బొమ్మను జాగ్రత్తగా కత్తిరించుకోవాలి. దీనికి చిలకపచ్చ రంగు వేయాలి. ముక్కుకు మాత్రం ఎరుపు రంగు వేయాలి. ఇప్పడు చిలక పొట్ట భాగంలో మధ్యలో ఒక రంధ్రం పెట్టాలి. ఇంక రీఫిల్‌ను మధ్యకు కత్తిరించాలి. ఈ రీఫిల్‌ను చిలక బొమ్మలోకి దూర్చాలి. దీన్ని బాటిల్‌లో పెట్టాలన్నమాట. మరి బాటిల్‌కు రంధ్రాలు లేకుండా సాధ్యం కాదు కదా. అందుకే బాటిల్‌కు రెండు వైపులా రంధ్రాలు చేయాలి. వాటిలో రీఫిల్‌ను ఇమడ్చాలి. ఇంక చివరిగా బాటిల్ మూతకు రంధ్రం వేసి దారం కట్టాలి. దీన్ని ఎక్కడైనా వేళ్లాడదీస్తే... గాలి వీచినప్పడల్లా బాటిల్‌లో చిలుక ఊగుతూ వుంటుంది. చూడ్డానికి చాలా ముచ్చటగా వుంటుంది. మరి చేసేస్తారా.



రంగులు వేసేద్దాం

వాహ్... వంకాయ కూర

హాయ్! ఇవాళ మిమ్మల్ని చాలా కష్టమైన పజిల్ ఒకటి అడగాలనుకుంటున్నాం. దానికి గాని మీరు జవాబు చెప్పారో ఇంక మీకు ఎదురే లేదు. ఒకవేళ చెప్పలేకపోయారో ... ఏమీ కాదు. జవాబు మేం చెప్తాం కదా. అది చూసి తెల్సుకోండి. ఓకేనా.

ఇద్దరు స్నేహితులు కలిసి ఒక హోటలుకెళ్లారు. ఒకరు బ్రింజాల్ కూరను, మరొకరు అబర్జైన్ కూరను తీసుకురమ్మన్నారు. వెయిటర్ రెండు ప్లేట్లలోనూ వంకాయ కూర తీసుకొచ్చి ఇద్దరి ముందు పెట్టాడు. ఇద్దరూ మరేం మాట్లాడకుండా హాయిగా తినేసి బిల్లు కట్టేశారు. ఎందుకని?

జవాబు: ఎందుకంటే ఇద్దరూ ఆర్డర్ చేసిన కూర వంకాయ కూరే. అందుకే చక్కగా తినేసి వెళ్లిపోయారు.

నేర్చుకుందాం



చకచకా చక్రం తిప్పాలి

చిన్నారులూ... ఇక్కడ ఓ జోకర్ వున్నాడు. మీకు నచ్చే వుంటాడు. అతని చేతిలో ఒక చక్రం వుంది. అందులో కూడా 1 నుంచి 11 వరకు అంకెలు వున్నాయి. కనిపించాయా. అయితే ఎటువైపు నుంచి ఏ మూడు అంకెలను కలిపినా 18 రావాలి. మరి అంకెలను తిరిగి సర్దండి. చివరికి మా సమాధానం చూడండి. ఎన్ని కరెక్టుగా రాస్తే మీకు అన్ని మార్కులు.

తారా తీరం చేరేదెలా?

హాయ్ నేస్తాలూ... ఇది క్రిస్టమస్ చెట్టని మీకు తెల్సుకదా. చెట్టుపైన వుండాల్సిన తార (నక్షత్రం) ఇలా పాపం చెట్టు పాదాల దగ్గర వుంది. దాన్ని చెట్టు శిఖరాగ్రానికి తీసుకెళ్లాలి. మరి ఏ మార్గంలో వెళ్తే ఇది సాధ్యమో చూడండి. చివరకు మా జవాబుతో సరిపోల్చుకోండి.



మాటల కోట - 8

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2	3	4	■	5		6	7
8				■		■	9	
	■	■	■	10		11		
12	13	14		■	■	15		■
■	16		■	■	17		■	■
18			19	20	■	■	21	
22		■	23		24	■		■
	■	25	■	26		■	27	28
29				■	30			

అడ్డం

1. ఉత్పత్తి (4)
5. ఒకటి నిలువు సంబంధీకుడే, తన అడుగుజాడ ఆయనేనని శ్రీశ్రీ అంటారు(4)
8. నియమిత స్థలానికి అటు నుంచి ఇటయిన పొలిమేర (4)
9. దానిలో 'ద' కొట్టుకుపోయింది (2)
10. మొగుడ్స్ పెళ్లామ్స్ ఏకవచనం, అన్నట్లు అక్కినేని, వాణిశ్రీ నటించిన సినిమా (5)
12. రాతలోనూ తన స్వరూపాన్ని పట్టిచూపిన తొట్రుబాటు (4)
15. యుద్ధమే (2)
16. జడ దారి మారింది (2)
17. రాజులనాటి రూపాయి (2)
18. రుచిని అనుభూతి చెందటం (5)
21. ఎద్దు, దీని పేరిటే కదా నంద్యాల (2)
22. సరిగమ రెండో సగం పాడనేలేదే (2)
23. ఆనవాయితీ, వాడుక (3)
26. నాలుగు చక్రాల భారీ వాహనం బోల్తాపడింది (2)
27. బీటీ రకానికి నిరసనగానేమో? చవులూరించే ఈ కాయ వంగిపోలేదుగానీ ఇటు అటయింది (2)
29. బుడబుక్కలవాడి చేతిలో ఊగేది (4)
30. పళ్లన్నీ బయటపెట్టి వెకిలిగా నవ్వటం (4)

నిలువు :

1. తెలుగు తొలి కథ (4)
2. వాస్తవం తప్ప వాస్తులేని ఆదిమ మానవుడి ఆవాసం (2)
3. నిర్దేశిత ప్రదేశం (2)
4. చప్పుడు, .. సేయకోగాలి అంటూ పాత సినిమా పాట. కింది నుండి పైకి (2)
5. చెవులకు పెట్టేవి కకావికలయ్యాయి (3)
6. మేలుకొని ఉన్నందునేమో గజిబిజి అయింది (4)
7. గారెలే. తిందామంటే ఎటెటో పోయాయే (3)
11. రిన్ సబ్బు ఉంది కాబట్టి ఇది మంచిదేనంటూ టీవీలో ఒకటే రొద (3)
13. దోవనపోయే(ది)వాడు. అక్కినేని, భానుమతి జంటగా సినిమా (4)
14. పన్నెండు (3)
18. తెలివిగలవాడు, రుచి ఎరిగినవాడు (4)
19. పెద్ద, మహా (2)
20. చీకటి పనులు చేస్తూ వీడియోకు చిక్కిన రాష్ట్ర మాజీ గవర్నరు (3)
21. కౌగిలింత ఇష్టం లేనట్లుంది. గజిబిజిగా కన్పిస్తోంది (4)
24. పోకిరి (3)
25. పడవే పెద్దది (2)
28. మలుపు, పక్కకు తిరిగిన (2)

మాటలకోట - 7 జవాబు

1 మ	2 క	రం	■	3 వీ	4 లు	5 నా	మా	■
6 హో	ని	■	7 గ	ణ	కు	డు	■	8 పు
ప్ర	■	9 సా	ద	■	10 ము	డు	11 పు	లు
12 స్థా	వ	రం	■	13 రా	■	14 నే	ర	క
నం	■	15 గం	16 డం	■	17 జు	■	పా	■
■	18 జ	■	19 గ	20 పా	■	21 వ	ల	22 పు
23 వ	ల	■	24 డో	ల	25 కం	■	26 క	ర
■	27 బం	డ	లు	■	28 వా	29 రం	■	స్కా
30 వి	ధం	■	■	31 గ	ల	భా	■	రం

రాజుగారి ఉంగరం

అవంతీ రాజ్యాన్ని మగధవర్మ అనే రాజు పాలించేవాడు. ఒకరోజు ఆయన వజ్రాల ఉంగరం కనిపించలేదు. వజ్రాల ఉంగరం పోయిందనీ, దాన్ని తెచ్చి అప్పగించిన వారికి మంచి బహుమతి ఇస్తానని ప్రకటించాడాయన. విశ్వేశం అనే వ్యక్తి రాజుగారి వద్దకు వచ్చి "ఆ ఉంగరాన్ని అప్పగించే పూచీ నాది. నేను జ్యోతిష్కుడిని. నేను అంజనం వేసి ఆ ఉంగరం ఎవరి దగ్గర వున్నదీ తెలుసుకోగలను. అయితే నేను ఐదారు రోజులు పూజలు చేయవలసి వుంటుంది" అని చెప్పాడు. రాజుగారు అతనికి బస ఏర్పాటు చేశాడు.

పూజ పూర్తయిన తర్వాత విశ్వేశానికి గది బయట ఎవరో తచ్చాడుతున్నట్లుగా అడుగుల శబ్దం వినిపించింది. వెంటనే అతను భార్యతో చెప్పాడు. "రాజాస్థానంలో ప్రధాన పదవిలో ఉన్న ఓ వ్యక్తికి రాజుగారి ఉంగరం దొరికింది. ఇప్పుడు అది అతని దగ్గరే వుంది" అని.

"మీకు ఆ దొంగెవరో అంజనం ద్వారా తెలిసిందా?" అని అడిగింది విశ్వేశం భార్య.

"తెలిసింది. రాజుగారి వజ్రపు ఉంగరం దొరికిన వ్యక్తి రాజాస్థానంలో ఉన్న ఉద్యోగుల్లో ఒకడు. అతడిని రాజుగారికి అప్పగిస్తాను. రాజుగారు అతని చేత నిజం చెప్పిస్తారు. నిజాయితీ లేని ఆ వ్యక్తిని ఉద్యోగ విధుల్లోంచి తొలగించడమే కాక, రాజ్య బహిష్కరణ కూడా చేయవచ్చు. నేను రాజుగారి అనుమతితో ఈ రాజ్యంలోనే కాక, చుట్టుపక్కల ఇతర రాజ్యాల నగల వర్తకులకు కూడా ఓ వర్తమానం పంపాను. ఎవరైనా నగలకు కానీ, వజ్రాలను కానీ, చిన్న వస్తువేదైనా అమ్మడానికి వస్తే రాజుగారికి తెలియజేయమని చెప్పాను" అంటూ భార్యకు సైగ చేశాడు.

భర్త సైగలోని అర్థాన్ని, అంతర్యాన్ని గ్రహించిన విశ్వేశం భార్య బయట పొంచివున్న వ్యక్తికి వినిపించేటట్లుగా పెద్దగా "జ్యోతిష్యంలో మిమ్మల్ని మించినవారు లేరండి. మీరు గొప్ప పండితులని అందరికీ తెలుసు" అంది.

విశ్వేశం ఊహించినట్లే బయటి వ్యక్తి లోపలకు వచ్చాడు. అతని ముఖంలో ఆందోళన, భయం స్పష్టంగా కనిపించాయి. "నాకు దొరికిన ఉంగరం రాజుగారిదని తెలిసే అత్యాశతో ఆయనకు అప్పగించలేదు. దయచేసి మీరే నన్ను కాపాడాలి. మీకు తప్పకుండా ప్రతిఫలం సమర్పించుకుంటాను. నా ఉద్యోగం నిలబెట్టి పుణ్యం కట్టుకోండి. నాకు జరిగే అవమానం నుండి, రాజుగారి శిక్ష నుండి మీరే నన్ను కాపాడాలి" అంటూ అతను విశ్వేశం పాదాల మీద వాలిపోయాడు.

తెలివిగా ఆలోచించిన విశ్వేశం పన్నాగం ఫలించింది. అతనిని సముదాయిస్తూ చెప్పాడు "రాజుగారి శిక్ష నుండి తప్పిస్తాను. అత్యాశకు గురై మరెన్నడూ ఇటువంటి నీతిమాలిన పనులు చేయకు. నీకు దొరికిన ఉంగరాన్ని నేను చెప్పినట్లు చేస్తే నీకా వుంగరం దొరికిందని కానీ, నువ్వు నీతి, నిజాయితీలు తప్పినవాడివని గానీ రాజుగారికి చెప్పను".



విశ్వేశం అతడిని రాజోద్యానవనానికి తీసుకెళ్లాడు. అక్కడ చాలా కుందేళ్లు తిరగడం గమనించిన విశ్వేశం వజ్రాల ఉంగరాన్ని ఒక కుందేలు నోట్లోకి జారవిడవమని చెప్పాడు. ఆ రాజోద్యోగి ఆ విధంగానే చేశాడు. కుందేలు ఉంగరాన్ని మింగేసింది. కుందేలును గుర్తించడానికి దాని మెడలో తెల్లటి దారాన్ని కట్టించాడు. వాళ్లిద్దరూ మర్నాడు రాజాస్థానానికి చేరుకున్నారు.

రాజుగారితో విశ్వేశం చెప్పాడు "మహారాజా, మీ ఉంగరం జాడ తెలిసింది. అది మీ తోటలోని ఒక కుందేలు కడుపులో వుంది".

ఆ మాటలకు అమితంగా సంతోషించిన మహారాజు ఆ కుందేలును గుర్తించవలసిన బాధ్యత విశ్వేశానికి అప్పగించాడు.

వారు వుద్యానవనానికి చేరుకున్నారు. మెడలో తెల్లదారం వున్న కుందేలును చూపించి, "దీని కడుపులోనే మీ ఉంగరం వుంది" అన్నాడు.

ఉద్యానవనంలో తన ఉంగరం జారిపడి వుంటుందని, ఆహారంతో పాటు దాని కడుపులోకి ఆ ఉంగరం చేరి వుంటుందని తలిచాడా రాజు.

రాజభటులు కుందేలును చంపి దాని కడుపులోనుండి ఉంగరాన్ని తీశారు.

రాజుగారు తాను ప్రకటించిన బహుమతిని విశ్వేశానికి ఎంతో ఆదరంగా అందించారు. అదే విధంగా రాజోద్యోగి కూడా తనను ఆపద నుండి కాపాడిన విశ్వేశానికి ధనాన్ని, బహుమతులను సమర్పించుకున్నాడు.

రాజుగారు తన ఆస్థాన జ్యోతిష్కునిగా నియమిస్తానని చెప్పారు. జ్యోతిష్యమే తెలియకుండా ఆ పదవిలో వుంటే తనకు ఎన్ని చిక్కులు ఏర్పడతాయోనన్న భయంతో పుణ్యక్షేత్రాలను దర్శించి వస్తామంటూ రాజుగారి వద్ద వీడ్కోలు తీసుకుని, ఆ రాజ్యం వదిలి పెట్టేశాడు విశ్వేశం. తన కుటుంబంతో ఆ రాజ్యానికి మరెన్నడూ రాకూడదని నిర్ణయించుకున్నాడతను.

- కె. నిర్మల

గ్రామసింహాలే!

ఏంటి మనం చూస్తోంది కుక్కల్నే కదా!

వందకు నూరు శాతం అవి శునకాలే.

మరి వాటిని చూస్తుంటే వేరే జంతువులు గుర్తొస్తున్నాయే...

గుర్తొస్తే రానివ్వండి. అవి మాత్రం గ్రామసింహాలే.

అసలు కుక్కలకు ఇలాంటి రంగులు, డిజైన్లు రావుకదా.

సహజంగా అయితే రావుగానీ ...మనం కోరుకుంటే వస్తాయ్.

అదెలా!

తెలియాలంటే చైనా పోవాల్సిందే.

అంత సీన్‌లేదు గానీ ఇందులో దాగిన మతలబేంటో...

ఇదేమంత పెద్ద వింత కాదు. పులిలా, పాండాలా కనిపించడానికి కుక్కలకు పసుపు, నలుపు రంగులు పులిమేశారు. అవి సూపర్‌గా నప్పాయికదూ.

య్యస్. అచ్చంగా పులిని, పాండాను చూస్తున్నట్టే వుంది. ఇంతకీ ఈ పెయింటింగ్ కుక్కలు చైనాలో ఎక్కడ వున్నాయేంటి?

హెనాన్ రాష్ట్రంలో ప్రదర్శించినప్పుడు తీసిన ఫొటోలే ఇవి. అవునూ... ఈ పెయింటింగ్ ఐడియా బావుందా? మీకు నచ్చకపోయినా కనీసం కుక్కలకైనా నచ్చి వుంటుందిలెండి. ఆ కాసేపైనా మరో జంతువులా కనిపించినందుకు పిచ్చ ఆనందం పొంది వుంటాయి.